జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 09 మే 2026 | సంపుటి: 19 | సంచిక: 62 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: పూర్ణిమ - 22:55:30 వరకు నక్షత్రంస్వాతి - 28:35:51 వరకు కరణంవిష్టి - 10:03:09 వరకు, బవ - 22:55:30 వరకు వక్షంశుక్ల యోగంసిద్ధి - 21:12:02 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు

హైదరాబాద్,మే8(ప్రజాజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు

మిగతా12లో..

మంత్రి పొంగులేటితో డిజిపి భేటీ

హైదరాబాద్,మే8(ప్రజాజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తెలంగాణ రాష్ట్ర డిజిపీ సి.వి. ఆనంద్ శుక్రవారం సచివాలయంలో

మిగతా 2లో..

తమిళనాడు ఉత్కంఠకు తెర

- **నేడు సీఎంగా విజయ్ ప్రమాణం**
- మద్దతుల లేఖలతో గవర్నర్‌తో మరోమారు భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు గవర్నర్ అనుమతి
- 11 గంటలకు నెహ్రూ స్టేడియంలో ప్రమాణ కార్యక్రమం
- కాంగ్రెస్, లెఫ్ట్ తదితర పార్టీల మద్దతు లేఖలు సమర్పణ
- టీవీకే కూటమి బలం 120కి చేరిక.. మద్దతుపై అనేక మెలికలు

చెన్నై,మే8(ప్రజాజ్యోతి): తమిళనాట ఉత్కంఠకు తెరపడింది. టివికె అధినేత విజయ్ నేడు సిఎంగా ప్రమాణం చేయబోతున్నారు. వివిధ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు సమర్పించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. తమిళ నాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు

మిగతా 2లో..

దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి

కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తా

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యా
- 430 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం
- కొండంగల్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడంగల్,మే8(ప్రజాజ్యోతి): దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరు గాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

మిగతా 12లో..

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి మా బాధ్యత

పాత ఆటోలను రెట్రో ఫిట్టింగ్‌తో ఎలక్ట్రిక్‌గా మారుస్తాం

సర్ కుట్రలను మనమంతా కలసికట్టుగా ఎదుర్కోవాలి

హజ్ యాత్రికుల బస్సులకు సీఎం రేవంత్ పచ్చజెండా

హైదరాబాద్,మే8(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నాంపల్లిలో హజ్ యాత్రికుల బస్సులను ఆయన జెండా ఊపి

మిగతా 12లో..

బెంగాల్ రాజకీయాల్లో బీజేపీ శకం

- రాష్ట్ర సీఎంగా సువేందు అధికారి
- శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నిక
- అమిత్ షా సమక్షంలో ఎమ్మెల్యేల భేటీ
- నేడు సీఎంగా సువేందు ప్రమాణ కార్యక్రమం
- మోడీ, అమిత్ షా, తదితర దిగ్గజాలు హాజరు

కోల్‌కతా,మే8(ప్రజాజ్యోతి): పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. రాష్ట్రంలో తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా సువేందు అధికారి పగ్గాలు చేపట్టనున్నారు. శుక్రవారం కోల్‌కతాలోని బిశ్వ బంగ్లా కన్వెన్షన్ సెంటర్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో జరిగిన బీజేపీ శాసనసభా పక్ష సమావేశంలో సువేందు అధికారిని శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్

మిగతా 12లో..

13న పుదుచ్చేరి సీఎంగా రంగస్వామి ప్రమాణం

చెన్నై,మే8(ప్రజాజ్యోతి): పుదుచ్చేరి ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.రంగసామి ముఖ్యమంత్రిగా ఈనెల 13న ప్రమాణస్వీకారం చేయనున్నారు. 30 సీట్లు ఉన్న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో 18 స్థానాలు గెలుచుకుని ఎన్డీయే కూటమి విజయం సాధించింది. ప్రభుత్వ ఏర్పాటుకు కేంద్రమంత్రి మాండవీయ, రంగసామి నేతృత్వంలో మిత్ర పక్ష నాయకులు, ఎమ్మెల్యేలు

కేరళం సిఎం రేసులో కేసీ వేణుగోపాల్

పార్టీ అధ్యక్షుడికి పరిశీలకుల నివేదిక

న్యూఢిల్లీ,మే8(ప్రజాజ్యోతి): కేరళంలో కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి విజయం సాధించడంతో ముఖ్యమంత్రి ఎంపికకు కసరత్తు జరుగుతోంది. ఈ రేసులో లోక్‌సభ ఎంపీ కేసీ వేణుగోపాల్ ముందున్నారని తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ పరిశీలకులు అజయ్ మాకెన్, ముకుల్ వాస్నిక్‌లు తమ నివేదికను

మిగతా 12లో..

తొలిదశకు గ్రీన్‌సిగ్నల్

- మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు
- హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు
- పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశం
- ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా నిధులు
- కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో మంత్రులు నిర్ణయం
- మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత
- మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి
- స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది
- అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం
- ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయండి
- జనంలో విశ్వసనీయత కల్పించేలా కార్యాచరణ
- ఉన్న నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్
- కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటి సీఎం భట్టి

హైదరాబాద్,మే8(ప్రజాజ్యోతి): మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం 55 కిలోమీటర్ల మేర 5 దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు 7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు. ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల కోసం సాంకేతిక, ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.మూసీ

మిగతా 2లో..

యువకుడి దారుణ హత్య.. ఉద్రిక్తత

యువతి ఇంటి ముందు తల్లిదండ్రుల ఆందోళన

హంతకులను పట్టుకుంటామన్న పోలీసులు

హైదరాబాద్,మే8(ప్రజాజ్యోతి): సికింద్రాబాద్ చిలకలగూడలో ఓ యువకుడి దారుణ హత్య ఉద్రిక్తతలకు దారి తీసింది. బీటెక్ విద్యార్థి యువన్‌ను కొందరు దారుణంగా చంపేశారు. ఈ హత్యకు ప్రేమ వ్యవహారమే కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. యువతి ఇంటి వద్ద యువన్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళనకు దిగారు. నిందితులను తమకు అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. యువతి కుటుంబసభ్యులే యువన్‌పై దాడి చేసి, కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపేశారని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. యువతి ఇంటి వద్ద భారీగా

మిగతా 2లో..

సోనార్ బంగ్లా కోసం కృషి

- మహనీయుల కలలు సాకారం చేస్తాం
- దశాబ్దాలుగా భయం గుప్పిట్లో బెంగాల్
- గో అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం
- చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం
- సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి దేశాన్ని రక్షిస్తాం
- కక్షసాధింపు రాజకీయాలకు బీజేపీ దూరం
- బీజేపీ లెజిస్లేచర్ పార్టీ భేటీలో అమిత్ షా

కోల్‌కతా,మే8(ప్రజాజ్యోతి): సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా క్లళెం వేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా

మిగతా 2లో..

సంపాదకీయం

మ్యాజిక్ ఫిగర్ లేకపోవడం గవర్నర్ తప్పా?

రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, చట్టాలు, శాసనసభ, లోక్‌సభ అంటే తెలియని వారంతా..ఇప్పుడు చట్టసభలకు ఎన్నికవుతున్నారు. భారత ప్రజాస్వామ్యంలో ఉన్న వెసలుబాటు కారణంగా ఎవ్వరైనా చట్టసభలకు ఎన్నిక కావచ్చు. ఎన్నికయ్యాక అయినా చట్టాలు, రాజ్యాంగ గురించి తెలుసుకుంటే బాగుండేది. కానీ అలా జరగడం లేదు. డబ్బులు, పలుకుబడి, మందబలం ఉంటే ప్రజాప్రతినిధులు అవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఏమీ తెలియకండా బయట ఉండేవారు చట్టాల గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడేస్తున్నారు. తమిళనాడు విషయంలో ఇదే జరుగుతోంది. టివికె పార్టీ పార్టీ పెట్టి,108 సీట్లు నెగ్గి, అత్యధిక మెజార్టీ సీట్లతో విజయ్ ముందున్నారు. ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 సీట్లు ఉండాలి. కేవలం అందరికన్నా మెజార్టీ సాధిస్తే లేదా అతిపెద్ద పార్టీగా అవతరిస్తే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని రూల్ ఏమీ లేదు. 118 సీట్లకు సంబంధించి మద్దతు పత్రాలను సమర్పించాలని గవర్నర్ విశ్వనాథ్ కర్లేకర్ కోరడంలో కూడా వింతేమీ లేదు. మద్దతు ఉందని తెలిస్తే తప్పకుండా ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించాల్సిందే. అలా కాకుండా అతిపెద్ద పార్టీగా గెలిచాం కనుక ప్రభుత్వ ఏర్పాటుకు పిలవాలని గవర్నర్‌ను డిమాండ్ చేయడం సరికాదు. అలాగే గవర్నర్‌ను నిందించడం అంతకన్నా సరికాదు. అందుకే చట్టం, రాజ్యాగం తెలియని నటులు ప్రకాశ్ రాజ్, విశాల్, కాంగ్రెస్ నేతలు గవర్నర్ తీరును తప్పు పడుతున్నారు. వీరంతా బిజెపి వ్యతిరేకులు కనుక గవర్నర్‌ను తప్పు పడుతున్నారు. గతంలో అనేక రాష్ట్రాల్లో ఇలా మద్దతు ఉన్నా లేకున్నా ప్రభుత్వాల ఏర్పాటుకు పిలిచి, బొక్కబోర్లా పడ్డ సంఘటనలు ఉన్నాయి. అలాగే హార్స్ ట్రేడింగ్ జరగడం చూశాం. కాబట్టి గవర్నర్ అనుసరించిన విధానమే రాజ్యాంగబద్ధం. అందుకే ఎన్నికల ఫలితాలు వచ్చి ఐదు రోజులు కావస్తున్నా.. వ్యవహారం ముందుకు కదలడం లేదు. టివికె అధినేత విజయ్‌కు మద్దతు ఇచ్చే వారు లేఖలు సమర్పించి ఉంటే ఈ పంచాయితీ రాదు. తమిళనాడు రాజకీయం రసకందాయంలో పడడానికి హంగ్ ఏర్పడడమే ప్రధాన కారణం. అలాగే గట్టిగా ఏ ఒక్క పార్టీ కూడా మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించలేదు. ఐదు సీట్లు కాంగ్రెస్ మాత్రమే ప్రకటించింది. అదికూడా మద్దతు లేఖ సమర్పించలేదు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ ఒక్క పార్టీ, కూటమికి మెజారిటీ రాకపోవడంతో ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన ఏర్పడింది. దీనికి గవర్నర్ తప్పు కాదు.ఆయన బిజెపి మనిషి కనుక ఇలా చేశారని అనేవాళ్లు మూర్ఖులు తప్ప మరొకరు కాదు. 234 సీట్లున్న తమిళనాడు అసెంబ్లీలో సినీ హీరో విజయ్ నేతృత్వంలోని టీవీకే 108 స్థానాల్లో గెలిచి మెజారిటీకి కాస్తా దూరంలో నిలిచి పోయారు. స్టాలిన్ నాయకత్వం లోని డీఎంకే కూటమి 73 స్థానాలకు పరిమితం కాగా, పళనిస్వామి నేతృత్వంలోని అన్నా డీఎంకే కూటమి 53 స్థానాలు గెలుచుకున్నది. ఈ మూడింటిలో ఏవో రెండు పార్టీలు కలిస్తే తప్ప ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం లేదు. ఎవరికి వారే భీష్మించుకొని కూర్చోవడంతో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ఆగిపోయింది. గవర్నర్‌ను విజయ్ సంప్రదించినా ఫలితం దక్కలేదు. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించా లంటే మ్యాజిక్ ఫిగర్ సభ్యుల మద్దతు తప్పనిసరి అని గవర్నర్ స్పష్టంచేశారు. దీంతో తమిళనాడులో సీఎం పీఠం ఎవరిది అనే తీవ్ర ఉత్కంఠ దేశవ్యాప్తంగా నెలకొన్నది. బీహార్‌లో 2005 ఎన్నికల్లో జేడీయూ, ఆర్జేడీ, ఎల్‌జేపీలో ఏ పార్టీ కూడా మ్యాజిక్ ఫిగర్ దాటలేదు. దీంతో అక్కడ ప్రభుత్వ ఏర్పాటులో ప్రతిష్టంభన నెలకొన్నది. తాము ఎవరికీ మద్దతిచ్చేది లేదని మూడు పార్టీల నేతలు భీష్మించుకున్నారు. విధి లేని పరిస్థితుల్లో గవర్నర్ బూటాసింగ్ రాష్ట్రపతి పాలనకు సిఫారసు చేశారు. అసెంబ్లీ రద్దు చేశారు. వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. ప్రతిష్టంభన పేరుతో అసెంబ్లీని రద్దు చేయడం అప్రజాస్వామికమని సుప్రీంకోర్టు తప్పుపట్టింది కానీ అప్పటికే రద్దయిన అసెంబ్లీ పునరుద్ధరించలేదు. ఆరునెలలకే అసెంబ్లీ ఎన్నికలు జరిగి జేడీయూ అధికారంలోకి వచ్చింది. సర్కారియా కమిషన్ సిఫారసుల ప్రకారం గవర్నర్ తొలుత మెజారిటీ సాధించిన పార్టీకి లేదా ప్రీపోల్ సంకీర్ణానికి అవకాశం ఇవ్వాలి. లేదా ఎన్నికల తర్వాత ఏర్పడ్డ సంకీర్ణానికి అవకాశం ఇచ్చి బలపరీక్షకు పురమాయించ చాలి. సర్వసాధారణంగా జరుగుతున్న తంతు ఇదే. ఎన్నికల్లో ఎవరికీ మెజారిటీ రాని సందర్భంలో అత్యధిక స్థానాలు గెలిచిన పార్టీని ప్రభుత్వం ఏర్పాటు కోసం ఆహ్వానించ వచ్చునా లేదా అన్న విషయంలో మాత్రం గవర్నర్లు ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధంగా నిర్ణయాలు తీసుకున్నారు. అలా తీసుకున్న సందర్భం లో విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఇలా గోవా, కర్నాటక, మహారాష్ట్రల్లో తలబొప్పి కట్టిన సంఘటనలు ఉన్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 నిబంధన ప్రకారం ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారు. ముఖ్యమంత్రి సలహాపై ఇతర మంత్రులను నియమిస్తారు. గవర్నర్ అభీష్టం ఉన్నంతకాలం వారు పదవిలో ఉంటారు. ఈ మేరకు గవర్నర్‌లు అంతా ఒకే రీతిన వ్యవహరించారు. కానీ ఎన్నికల్లో హంగ్ ఏర్పడితే ముందుగా ఎవరిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలన్న విషయంలో ఒక విధానం అంటూ లేకుండా పోయింది. అక్కడే గవర్నర్ల విచక్షణాధికారం చట్టాన్ని అపహాస్యం చేసిన సందర్భాలు చూశాం. రాజకీయ నేతలను గవర్నర్లుగా నియమించడం మొదలయ్యాక విచక్షణాధికారం ఆయా పార్టీల విధానాలకు అనుగుణంగా మారింది. ఇలాంటి దుష్ట సంప్రదాయాలను కాంగ్రెస్ పార్టీ మొదలు పెట్టింది. బిజెపి కొనసాగిస్తోంది. అత్యధిక స్థానాలు గెలుచుకున్న పార్టీని ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించాలా వద్దా అనే విషయంలో ఒక స్పష్టత ఇస్తే తమిళనాడు వంటి వివాదాలు భవిష్యత్తులో తలెత్తవు. ఆ దిశగా కేంద్రం రాజ్యాంగ సవరణ చేస్తే మరీ మంచిది. డీఎంకే, అన్నాడీఎంకే కూటములు ప్రభుత్వ ఏర్పాటుకు ముందుకు రాని నేపథ్యంలో విజయ్‌కి గవర్నర్ అవకాశం ఇస్తే పెద్దగా అభ్యంతరాలు ఎందుకని చాలామంది ప్రశ్నిస్తున్నారు. కానీ ఇక్కడా గవర్నర్ తన పరిధి మేరకు, రాజ్యాంగ బద్ధంగానే మద్దతు లేఖలు కోరారు. అందులో తప్పుకూడా లేదు. తన బలాన్ని నిరూపించుకోవడానికి రెండు వారాల సమయం కావాలని అడగడంతోనే అక్కడ మెలిక ఉంది. అధికారంలోకి వచ్చిన తరవాత ఓ పదిమంది ఎమ్మెల్యేలను కొనడం సులువు. అలాంటి ఉదాహరణలు కోకొల్లలు. కాబట్టి హార్స్ ట్రేడింగ్‌కు అవకాశం లేకుండా, నడుచుకోవాలన్న గవర్నర్ నిర్ణయం సమర్థనీయం. అన్నా డీఎంకే, డీఎంకేల్లో ఒకరు మద్దతిస్తే విజయ్ ముఖ్యమంత్రి కావచ్చు. లేదా డీఎంకే, అన్నా డీఎంకే కూటములు కలిస్తే కాంగ్రెస్, బీజేపీ సహకారం లేకపోయినా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగే 121 సీట్ల బలం వారికి ఉన్నది. ఈ క్రమంలో గవర్నర్‌ను విమర్శించే వారు చట్టాలను, రాజ్యాంగాన్ని తెలుసుకుంటే మంచిది. మరీ ముఖ్యంగా సినిమా నటులకు ఇది వర్తిస్తుంది.

తమిళనాడు ఉత్కంఠకు తెర

మొదటిపేజీ తరువాయి..

ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మే 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది.

ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరుతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరడానికి అడుగులు పడుతున్నా.. మిత్రపక్షాల షరతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు వీసీకే తమ మద్దతుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశాయి. విజయ్ ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వామపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. టీవీకే ప్రభుత్వానికి తాము కేవలం బయటి నుంచే మద్దతు ఇస్తామని.. కేబినెట్‌లో చేరే ఉద్దేశం లేదని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. ప్రస్తుత రాజకీయ అనిశ్చితిని తొలగించి, ఒక సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న ఉద్దేశంతోనే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఇక, టీవీకేకు ముందుగానే మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్‌కు ఒక కీలకమైన షరతు విధించింది. భవిష్యత్తులో టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ మతతత్వ పార్టీలతో చేతులు కలపకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ షరతుకు లోబడి ఉంటేనే.. తమ 5 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటుందని హైకమాండ్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకమైన 2 స్థానాలు కలిగిన విదుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ తనదైన వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. వచ్చే ఉపఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని ఆయన షరతు పెట్టారు. తిరుమావళవన్ స్వయంగా తిరుచ్చి ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ స్థానం ఇస్తేనే టీవీకేకు మద్దతుపై తుది సంతకం చేసే అవకాశం ఉంది. వామపక్షాలు కేబినెట్‌లో చేరకపోవడం వల్ల విజయ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలకే ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, తిరుమావళవన్ కోరుతున్న 'తిరుచ్చి ఈస్ట్' స్థానం విషయంలో విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

తొలిదశకు గ్రీన్‌సిగ్నల్

మొదటిపేజీ తరువాయి..

పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది. నదిలోని చెత్తను తొలగించి, రివర్ బెడ్ ప్రొఫైలింగ్‌ను ప్రభుత్వం చేపట్టనుంది. వరద నియంత్రణకు రిటైనింగ్ వాల్స్‌ను నిర్మించనున్నారు. మూసీ రెండు వైపులా రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం, నీటి నిల్వ కోసం బ్యారేజీలు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణకు డీపీఆర్‌ను తయారీకి నిర్ణయం తీసుకున్నారు. ప్రాజెక్టు వివరాలను నగరవ్యాప్తంగా ప్రచారం చేయాలని సబ్ కమిటీ ఆదేశించింది. బస్టాండ్లు, ప్రధాన రోడ్లు, థియేటర్లలో ప్రచార వీడియోలు ప్రదర్శించనున్నారు. 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించడం లక్ష్యంగా నిర్ణయించారు. డిసెంబర్ 2027 నాటికి ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక పర్యవేక్షణకు సహకారం తీసుకోనున్నారు. నిర్మాణాలపై ప్రభావం లేని 5.కి.మీ మేర పనులు ప్రారంభించాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్ మార్చాలని మంత్రులు సూచించారు. మూసీ ప్రాజెక్టు పనులను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించి 2027 డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో పనులకు ఆటంకం లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మూసీపై రబ్బర్ డ్యామ్ నమూనాలను ఈ సందర్భంగా ఉపసంఘం పరిశీలించింది.

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి – ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశర చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ –1 సుమారు 7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చు కునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ –1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొ÷ల÷లింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మరెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్–టు–వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి –గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన పక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకొవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్ ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశిరచుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి, జెఎన్ టియూ సంస్థల నుంచి తగిన సహకారం తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగాంగ నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు ఆసక్తిగా తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు.

ఈ సమవేశంలో మెట్రో పాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

మొదటిపేజీ తరువాయి..

మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు. ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

మంత్రి పొంగులేటితో డిజిపి భేటీ

మొదటిపేజీ తరువాయి..

మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మంత్రి కూడా శాలువా కప్పి సి.వి. ఆనంద్‌ని అభినందించారు. పోలీసింగ్‌లో రాష్ట్రం ఉన్నత శిఖరాలను చేరుకునేలా కృషి చేయాలని మంత్రి శ్రీనివాసరెడ్డి అభిలషించారు.

యువకుడి దారుణ హత్య.. ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి..

పోలీసులు మోహరించారు. మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. గురువారం యువన్ తన స్నేహితులతో కలిసి చిలకలగూడలో ఓ ఇంట్లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం కత్తులతో, మారుణాయుధాలతో యువన్‌పై దాడి చేశారు. తల, గొంతు, శరీరభాగాల్లో తీవ్రమైన కత్తిపోట్లు కావడంతో యువన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. శుక్రవారం ఉదయం యువన్ కుటుంబసభ్యులు యువతి ఇంటి వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని, నిందితులను అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు. యువన్ హత్యకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ నరసయ్య మీడియాకు తెలియజేశారు. 'రాత్రి 8:30 గంటల సమయంలో యువన్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. ప్రేమ వ్యవహారం హత్యకు కారణంగా ప్రాథమికంగా తెలుస్తోంది. మృతుడి కుటుంబం గతంలో సీతాఫల్‌మండిలో ఉండేది. ఆ సమయంలోనే యువతి, యువన్‌కు మధ్య ప్రేమ మొదలైంది. జవహర్‌నగర్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు రావడంతో నాలుగు నెలల క్రితం అక్కడికి యువకుడి కుటుంబం షిఫ్ట్ అయ్యింది. గతరాత్రి స్నేహితులతో కలిసి యువన్ మ్యాచ్ చూస్తున్న సమయంలో ఒక్కసారిగా దాడి చేశారు. యువన్‌కు తీవ్రమైన కత్తిపోట్లు అయ్యాయి. ఆస్పత్రికి తరలించాక మరణించాడు. హత్యలో పరమేశ్ అనే వ్యక్తితో పాటు మరో ఐదు మంది పాలుపంచుకున్నట్లు తెలుస్తోంది. నిందితుల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. త్వరలో నిందితులను అరెస్ట్ చేస్తాం. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తాం. నిందితులకు డ్రగ్స్ అలవాటు ఉందా లేదా అని పరీక్షలు చేస్తాం. ఇప్పటికీ మృతుడు, ప్రేమించిన యువతి మాట్లాడుకుంటున్నారా? లేదా అని తెలియాల్సి ఉంది. హత్య కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నాం. గతంలో నిందితులపై కేసులు గురించి ఆరా తీస్తాం. ఈ కేసులో అమ్మాయి ప్రమేయం, ఫోన్ సంభాషణలపై పూర్తి స్థాయిలో విచారణ చేస్త

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

గతంలో కలిసి పనిచేసిన జ్ఞాపకాలను నేమరేసుకున్న నిర్మల్ డిసిసి అధ్యక్షులు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్ మే 8(ప్రజా జ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోనికలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా బాధ్యతలు ఇటువల స్వీకరించిన కలెక్టర్ భవేష్ మిశ్రాని మర్యాదపూర్వకంగా కలిసి గతంలో ఉట్నూర్లో ఐటిడిఎ పిఓగా పనిచేసిన సందర్భంగా తాను కలిసిపని చేసిన సందర్భాలు నెమరేసుకున్నారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పనిచేసిన అనుభవం ప్రస్తుతం తమకు అనుకూలంగా అభివృద్ధికి సహకరిస్తుందని నిర్మల్ డిసిసి అధ్యక్షులు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు జిల్లా అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారుల భాగస్వాములయ్యి కలిసికట్టుగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అపేక్షించారు. దీనికి అధికారులు కృషి చేసేందుకు ఆదేశించాలని నూతన కలెక్టర్ భవేష్ మిశ్ర ను ఎమ్ ఎల్ ఎ బొజ్జు పటేల్ కోరారు.జిల్లా అభివృద్ధిని ప్రజా ప్రభుత్వంలో కలిసి పనిచేద్దాం కలెక్టర్ తో అన్నారు.

పశువుల ఆరోగ్య రక్షణే లక్ష్యం : డాక్టర్ రాథోడ్ జీవన్

నేరడిగొండ, మే 08 (ప్రజాజ్యోతి) : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో ఉచిత సమగ్ర పశువర్ధక చికిత్స మరియు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రాథోడ్ జీవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు.గర్భకోశ వ్యాధి చికిత్స 5 పశువులకు ప్రత్యేక చికిత్సలు చేశారు. 32 దూడలతో పాటు, 450 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను పంపిణీ చేశారు. 25 పశువులకు వివిధ అనారోగ్య సమస్యలకు గాను వైద్యం అందించారు. రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను మరియు మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవన్ మాట్లాడుతూ.. పశువుల పోషణలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రూపవత్ కృష్ణ నాయక్, విలేజ్ ఆర్గనైజేషన్ సభ్యులు వెంకన్న, ఓఎస్ రాజన్న, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మహారాణా ప్రతాప్ జయంతి

– స్వాభిమానం, దేశభక్తి ప్రతీక మహారాణా ప్రతాప్

మంచిర్యాల, 8, మే (ప్రజాజ్యోతి) : భారతదేశ చరిత్రలో స్వాభిమానం, ధైర్యం, దేశభక్తి, స్వాతంత్ర్య సంకల్పానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుల్లో మహారాణా ప్రతాప్ పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని సామాజిక విశ్లేషకులు ఆళవందార్ వేణు మాధవ్ అన్నారు. రాజపుత్ర వీరత్వానికి ప్రతీకగా నిలిచిన మహారాణా ప్రతాప్ మొఘల్ చక్రవర్తి అక్బర్ ఎదుట తలవంచకుండా చివరి శ్వాస వరకు పోరాడిన మహా యోధుడని కొనియాడారు.

1540 మే 9న రాజస్థాన్‌లోని కుంభల్‌గఢ్ కోటలో జన్మించిన మహారాణా ప్రతాప్ చిన్నప్పటి నుంచే గుర్రపు స్వారీ, ఖడ్గ విద్య, యుద్ధకళల్లో ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. రాజపుత్ర సంస్కృతి, స్వాభిమానం, ధైర్యం ఆయనలో బాల్యం నుంచే బలంగా పెరిగాయని చెప్పారు. మేవార్ రాజ్యానికి వారసుడిగా ఎదిగిన ప్రతాప్ ప్రజల ప్రేమను సంపాదించడంతో పాటు అపారమైన శౌర్యానికి ప్రతీకగా నిలిచారని వివరించారు.16వ శతాబ్దంలో అక్బర్ భారతదేశాన్ని ఏకీకృతం చేయాలని సంకల్పించినప్పటికీ, మేవార్ మాత్రం మొఘల్ ఆధీనాన్ని అంగీకరించలేదని తెలిపారు. పలుమార్లు దౌత్య ప్రతినిధు లను పంపించి లొంగిపోవాలని కోరినా, మహారాణా ప్రతాప్ "రాజ్యాన్ని కోల్పోయినా పరవాలేదు కానీ స్వాభిమానాన్ని కోల్పోను" అనే ధృఢ సంకల్పంతో నిలిచారన్నారు. 1576 జూన్ 18న రాజస్థాన్‌లోని హల్దీఘాటిలో మహారాణా ప్రతాప్ సేనలకు, మొఘల్ సేనలకు మధ్య జరిగిన ఘోర యుద్ధం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తక్కువ సైన్యం ఉన్నప్పటికీ అపార ధైర్యంతో పోరాడిన మహారాణా ప్రతాప్‌కు ఆయన గుర్రం "చేతక్" విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. గాయపడిన చేతక్ తన యజమానిని రక్షించి చివరకు ప్రాణాలు విడిచిన ఘటన చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు.హల్దీఘాటి యుద్ధం అనంతరం అడవుల్లో కుటుంబంతో కలిసి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ మహారాణా ప్రతాప్ అక్బర్‌కు ఎప్పటికీ లొంగిపోలేదని తెలిపారు. గడ్డి రొట్టెలు తిన్న రోజులు వచ్చినా స్వాతంత్ర్యాన్ని రాజీ పడలేదని, అనంతరం మళ్లీ బలగాలను సమీకరించి మేవార్‌లోని అనేక ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుని చావండ్‌ను రాజధానిగా చేసుకొని పరిపాలన కొనసాగించారని వివరించారు.ప్రజా సంక్షేమం, వ్యవసాయం, రక్షణ వ్యవస్థల పునర్నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెట్టిన పాలకుడిగా మహారాణా ప్రతాప్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. మొఘల్ సేనలపై అనేక వ్యూహాత్మక దాడులు చేసి వారిని బలహీన పరిచారని తెలిపారు. 1597 జనవరి 19న మహారాణా ప్రతాప్ మరణించినప్పటికీ, "మేవార్ స్వాతంత్ర్యం కాపాడాలి" అనే ఆయన సందేశం తరతరాల కు స్ఫూర్తిగా నిలిచిందని ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు. మహారాణా ప్రతాప్ కేవలం రాజు మాత్రమే కాకుండా స్వాతంత్ర్యానికి, స్వాభిమానానికి ప్రతీకగా భారత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.

రాష్ట్రీయ హిందూ పరిషత్ లీగల్ అడ్వైజర్ న్యాయవాది నటేశ్వర్‌కు ఘన సన్మానం

మంచిర్యాల, 8, మే (ప్రజాజ్యోతి) : రాష్ట్రీయ హిందూ పరిషత్ లీగల్ అడ్వైజర్, మాజీ రాష్ట్రీయ హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర గోరక్ష వైస్ ప్రెసిడెంట్ న్యాయవాది నటేశ్వర్‌ను నాంపల్లి హైదరాబాద్ క్రిమినల్ కోర్టులో ఘనంగా సన్మానించారు. నాంపల్లి క్రిమినల్ కోర్ట్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల రాజు గౌడ్, జనరల్ సెక్రటరీ వేణుగోపాల్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లైబ్రరీ అండ్ కల్చరల్ సెక్రటరీ, మహిళా న్యాయవా దులు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొని నటేశ్వర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే నటేశ్వర్ 50 సార్లు రక్తదానం చేయడంతో పాటు 29 సార్లు ప్లేట్లెట్స్ దానం చేసి పలువురి ప్రాణాలను కాపాడారని కొనియాడారు. అలాగే గోరక్షకుడిగా గోమాతలను రక్షించడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం, యోగ మాస్టర్‌గా అలాగే మానసిక–శారీరక కోచ్‌గా సమాజానికి సేవలందించడం అభినందనీయ మన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా అందరికీ అందుబాటులో ఉంటూ సేవాభావంతో పనిచేస్తున్న నటేశ్వర్ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి మంచి న్యాయవాదిగా, ప్రజానాయకుడిగా ఎదగాలని పలువురు ఆకాంక్షించారు.

మానవత్వం చాటుకున్న 'నేషనల్ మార్ట్' ఉద్యోగులు

నేరడిగొండ మే 08 (ప్రజాజ్యోతి) : మానవత్వం ఇంకా మిగిలే ఉందని నిరూపిస్తూ ముగ్గురు యువకులు ఓ మూగజీవి ప్రాణాలను కాపాడి అందరి అభినందనలు అందుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆవు దూడకు సకాలంలో సహాయం అందించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలోని జాతీయ రహదారి–44 టోల్ ప్లాజా సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం ఆవు దూడను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దూడ తీవ్రంగా గాయపడి, రక్తపు మడుగులో ఎండలోనే కొట్టుమిట్టాడుతూ పడిపోయింది. ప్రమాదానికి కారణమైన వాహనదారుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న నేషనల్ మార్ట్ ఉద్యోగులు హరికృష్ణ, రవి, నవీన్ రెడ్డిలు దూడ పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. తమ వాహనాన్ని ఆపి, గాయాలతో ఉన్న దూడను జాగ్రత్తగా రోడ్డు పక్కనున్న చెట్ల నీడలోకి తరలించి నీరు అందించారు. అనంతరం స్థానిక పశువైద్యాధికారి రాథోడ్ జీవన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దూడకు ప్రథమ చికిత్స అందించారు. సమయానికి వైద్యం అందడంతో దూడ ప్రాణాపాయం నుంచి బయటపడింది. మూగజీవి ప్రాణాలను కాపాడేందుకు చొరవ చూపిన నేషనల్ మార్ట్ ఉద్యోగుల సేవాభావాన్ని స్థానికులు మరియు పశువైద్య సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు పునరుజ్జీవం: ఇందిరమ్మ ప్రభుత్వం

● ప్రాణహిత నదికి జలహారతి పట్టిన మంత్రులు జూపల్లి, వివేక్ ● మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం: కాళేశ్వరం వృథా ఖర్చు

ఆసిఫాబాద్ మే 8 ప్రజా జ్యోతి : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా: గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కనబెట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు (తుమ్మిడిహెట్టి బరాజ్)కు పునరుజ్జీవం పోయాలని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నిర్ణయించింది. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తుమ్మిడిహెట్టి ప్రతిపాదిత ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు చేసి జలహారతి పట్టారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో రూ.38,500 కోట్లతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. 46 కి.మీ కెనాల్ పనులు పూర్తయినా గత ప్రభుత్వం పక్కనబెట్టి కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు వృథా చేసిందని మండిపడ్డారు. గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉన్నా పంపులతో ఎత్తిపోయడం వల్ల విద్యుత్ భారం పెరిగిందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల బరాజ్ నిర్మిస్తే విద్యుత్ ఖర్చు లేకుండా ఎల్లంపల్లికి నీరు తరలించవచ్చని, సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. మహారాష్ట్ర శివిని గ్రామానికి ముంపు ఉండదని, భూములు కోల్పోయేవారికి మెరుగైన పరిహారం ఇస్తామన్నారు. త్వరలో మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. కమిషన్ల కోసమే కేసీఆర్ ప్రాణహితను కాళేశ్వరానికి తరలించి ఉమ్మడి ఆదిలాబాద్‌కు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. కేసీఆర్ తుగ్లక్ సీఎం అని, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. పదివేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును పక్కనబెట్టి లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టినా ఒక్క టీఎంసీ కూడా సరిగ్గా వాడలేదన్నారు. తుమ్మిడిహెట్టితో 16 లక్షల ఎకరాలకు, ఉమ్మడి ఆదిలాబాద్‌లో 2 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, త్వరలో శంకుస్థాపన చేస్తారని చెప్పారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రధాని మోదీ, మహారాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని మంత్రులు కోరారు. రాజకీయాలకు అతీతంగా ప్రాజెక్టుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, కలెక్టర్ హరిత, ఎస్పీ నిఖిత పంత్, సాగునీటి శాఖ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

– రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు

మంచిర్యాల, 8, మే (ప్రజాజ్యోతి) : ధాన్యం కొనుగోలు విషయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి తీవ్రంగా విమర్శించా రు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గడ్‌పూర్ గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి 15 రోజులు గడిచినా కొనుగోలు ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభించడం దారుణమన్నారు. ప్రభుత్వం సమయానికి ధాన్యం కొనుగోలు చేపట్టకపోవడంతో అకాల వర్షాల కారణంగా ధాన్యం తడిసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం మాయిశ్చర్ శాతం పరిమితిలో ఉన్నప్పటికీ తరుగు పేరుతో అదనంగా రెండు కిలోలు కాంటా పెడుతూ రైతుల శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ బస్తాకు 40.8 కిలోల మేర మాత్రమే కాంటా ఉంటుందని ప్రకటించినా, క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదన్నారు.మరోవైపు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల కొరత కారణంగా రైస్ మిల్లులకు సకాలంలో తరలించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి వెంటనే రైతులకు రసీదులు అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గడికొప్పుల సుధాకర్, చుంచు శ్రీనివాస్, లింగాల అశోక్, భీమ్‌రావు, అనిల్, మురళి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

– రాజకీయ జోక్యమే సింగరేణి ఆర్థిక సంక్షోభానికి కారణం– ఏబీకేఎంఎస్––బీఎంఎస్

– ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు కార్మికులను మోసం చేశాయి

మంచిర్యాల, 8,మే (ప్రజా జ్యోతి) : సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఏబీకేఎంఎస్––బీఎంఎస్) ఆధ్వర్యంలో జేవీఆర్ ఓసీ సత్తుపల్లిలో ఉప్పు శ్యాంసుందర్ అధ్యక్షతన శుక్రవారం భారీ గేట్ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సమావేశానికి ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభానికి ప్రధాన కారణం తెలంగాణ ప్రభుత్వ సంస్థలైన ట్రాన్స్కో, జెన్కో తదితర సంస్థలు సింగరేణికి చెల్లించాల్సిన బకాయిలను సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడమేనని ఆరోపించారు. సుమారు రూ.53 వేల కోట్లకు పైగా బకాయిలు పేరుకు పోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటి చెల్లింపుపై నిర్లక్ష్య ధోరణి అవలంబించడం దురదృష్టకరమన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండూ కూడా సింగరేణిపై రాజకీయ జోక్యం పెంచి సంస్థను ప్రభుత్వ ఆదేశాలకు బానిసగా మార్చాయని విమర్శించారు. ఉత్పత్తి అయ్యే బొగ్గులో సగానికి పైగా రాష్ట్ర ప్రభుత్వ సంస్థలే వినియోగిస్తున్న ప్పటికీ, బిల్లులను సకాలంలో చెల్లించకపోవడం వల్ల సింగరేణి తీవ్ర నగదు కొరతలోకి నెట్టబడిందన్నారు. పరిస్థితి ఇంత దారుణంగా మారి కార్మికులకు జీతాలు చెల్లించేందుకు కూడా బ్యాంకుల వద్ద అప్పులు తెచ్చే స్థితికి సంస్థ చేరుకుంద ని ఆవేదన వ్యక్తం చేశారు.

సింగరేణి సంస్థ ఆర్థికంగా కుంగిపోతున్నా, కార్మికుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతున్నా, ఎన్నికల్లో హామీలు ఇచ్చి గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ సంఘాలు రెండు సంవత్సరాల కాలంలో ఒక్కరోజు కూడా ప్రభుత్వంపై పోరాటం చేయలేదని మండిపడ్డారు. రాజకీయ అనుబంధాల కారణంగా కార్మిక ప్రయోజనాలను తాకట్టు పెట్టి మౌనంగా వ్యవహరించాయని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలపై స్పందించని ఈ సంఘాలు ఇప్పుడు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకు నేందుకు నకిలీ పోరాటాల పేరుతో కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. సింగరేణికి రావలసిన వేల కోట్ల బకాయిలు, కార్మికుల మెడికల్ బోర్డులు, సొంతింటి కల, పేర్స్పై ఇన్‌కమ్ టాక్స్ రీయింబర్స్‌మెంట్, క్యాడర్ స్కీములు తదితర అంశాల లో గెలిచిన సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు.దేశవ్యాప్తం గా బొగ్గు గని కార్మికుల 12వ వేతన ఒప్పందానికి సంబంధించి జేబీసీసీఐ కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గేట్ మీటింగ్‌లు, ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సింగరేణిలో అనారోగ్యంతో బాధపడుతూ విధులు నిర్వర్తిస్తున్న వందలాది మంది కార్మికులకు మెడికల్ బోర్డులునిర్వహించక పోవడం గెలిచిన సంఘాల అసమర్థతకు నిదర్శనమని అ న్నారు. వెంటనే మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి కార్మికుల కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.ఎస్. పవన్ కుమార్, ఏరియా ఉపాధ్యక్షు లు మొగిలిపాక రవి, ఏరియా సెక్రటరీ వి. నాగప్రసాద్, జేవీఆర్ ఓసీ పిట్ కమిటీ నాయకులు ఉప్పు శ్యాంసుందర్, అయితా రవి, జె. క్రాంతి, ఎం.వి. చారి, ఏ. సుబ్బారావు, డి. వెంకటేశ్వర్లు, సిర శ్రీనివాస్, ఎం. సురేష్ ఓర్మెన్, బి. సురేష్ ఓర్మెన్, బల్లి శ్రీనివాస్ ఓర్మెన్, శేఖర్ ఓర్మెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ స్థల పరిశీలన మంత్రులతో కలిసి సందర్శించిన శ్యామ్ నాయక్

అంబేద్కర్ విగ్రహానికి నివాళులు



ఆసిఫాబాద్, మే 8 ప్రజాజ్యోతి : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదిత ప్రాణహిత బ్యారేజ్ నిర్మాణ స్థలాన్ని శుక్రవారం రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పరిశీలించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, సిర్పూర్ ఎమ్మెల్యే హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్‌తో కలిసి ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ బ్యారేజ్ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం తుమ్మిడిహెట్టి పుష్కర ఘాట్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి మంత్రులు, నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో కడెం ప్రాజెక్టు ట్రాస్ ర్యాక్ మ్యాప్ పరిశీలించిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్

ఖానాపూర్ మే 8(ప్రజాజ్యోతి) : ఖానాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ కడం ప్రాజెక్టుకు సంబంధించిన ట్రాస్ ర్యాక్ మ్యాప్‌ను వందిత అధికారులతో సమీక్ష సమావేశం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం నిర్వహించారు కడెం డ్యామ్ తుక్కు అడ్డు కట్ట ట్రాస్ ర్యాక్ మ్యాప్ డిజైనింగ్ పూర్తి స్థాయిలో డ్యామ్ పనులు ప్రారంభించిన త్వరగా పూర్తి చేయాలని రానున్న వర్ష కాలంలో ఎలాంటి సమస్యలు కడెం ప్రాజెక్టు ద్వారా తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ, డి ఈ తదితరులు ఉన్నారు.

సర్పంచ్ చొరవ తీరిన నీటి కష్టాలు

నేరడిగొండ, మే 08 (ప్రజాజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు సర్పంచ్ చొరవతో వెనువెంటనే పరిష్కారం లభించింది. గ్రామ బస్టాండ్ ప్రాంతంలో ఉన్న మంచినీటి బోరు మోటారు పాడవడంతో గత కొన్ని రోజులుగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. సమస్య తీవ్రతను గుర్తించిన సర్పంచ్, వెంటనే వ్యక్తిగత శ్రద్ధతో కొత్త మోటారును తెప్పించి, యుద్ధప్రతిపాదికన పనులను పూర్తి చేయించారు. దీంతో బస్టాండ్ ప్రాంత వాసులకు తాగునీటి ఇబ్బందులు తొలిగిపోయాయి. సమస్యను తెలిపిన వెంటనే స్పందించి, నీటి ఎద్దడిని తీర్చిన సర్పంచ్ శ్రీకాంత్‌తో పాటు వార్డు సభ్యులకు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్మిక కుటుంబాలకు ఇన్సూరెన్స్‌తో లాభాలు

– పాత ఎల్లాపూర్‌లో సమీక్ష సమావేశం

ఖానాపూర్ మే 8 (ప్రజా జ్యోతి) : నిరుపేద కార్మిక కుటుంబాలకు భీమ ఎంతో లాభం చేకూరుస్తుందని నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో కార్మిక ఉపాధి కల్పనా శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఈ ముత్యంరెడ్డి సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది ఈ సందర్భంగా పలువురు కార్మిక శాఖ అధికారులు గ్రామంలో గల వారందరికీ ఇన్సూరెన్స్ పథకాన్ని వర్తింపజేయడం పట్లయువ సర్పంచ్ ఏలేటి ప్రశాంత్ రెడ్డి పాలకవర్గాన్ని ప్రశంసించారు బీమా పట్ల ప్రజలకు సంపూర్ణంగా వివరించారు ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబాలు రోడ్డున పడకుండా ఇన్సూరెన్స్ ఆదుకుంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కార్మిక శాఖ అధికారి జి రాజలింగు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిని విజయలక్ష్మి సిబ్బంది వినయ్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకుషాపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

ఆసిఫాబాద్ మే 8 ప్రజాజ్యోతి : ఆసిఫాబాద్ మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఉచిత పశువుల గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టేకం గంగారం, సర్పంచ్ సంఘం ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. శిబిరంలో సుమారు 100 పశువులకు వివిధ రకాల వ్యాధులకు చికిత్సలు అందించారు. అలాగే దూడలకు నట్టల నివారణ మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. వేసవి కాలంలో పశువుల సంరక్షణపై అవగాహన కల్పించే పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్య అధికారి డాక్టర్ మురళీకృష్ణ, పశువైద్య సిబ్బంది మోతీరం, వినోద్, రైతులు మల్లేష్, బోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం..

– కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు ఉండొద్దు

– నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవు: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మే 8 (ప్రజాజ్యోతి): రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం వీరాయపల్లి గ్రామంలో ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంఘం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం

కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సమాఖ్యలు, పీఏసీఎస్, మెప్మా సంస్థలతో పాటు ఎఫ్‌పీఓలను కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వీరాయపల్లిలో వారి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతోందని, ఎక్కడైనా సమస్యలు తలెత్తితే అధికారులు వెంటనే పరిష్కార చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. లారీలు, గన్ని బస్తాల కొరత వంటి సమస్యలు ఉన్న ప్రాంతాల్లో కూడా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నామని తెలిపారు. అధికారులు ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ధైర్యంగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని, ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

బైపాస్ రోడ్డుపై ప్రమాదాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, మే 8 (ప్రజా జ్యోతి బ్యూరో)

మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డుపై తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ దరావత్ జానకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రమాదాలకు గల కారణాలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఆమె, అనంతరం పోలీసు అధికారులు మరియు నేషనల్ హైవే అథారిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రహదారిపై ప్రమాద సూచిక

బోర్డులు ఏర్పాటు చేయడం, రాత్రి వేళల్లో వాహనదారులకు స్పష్టంగా కనిపించే విధంగా రేడియం స్టిక్కర్లు అమర్చడం, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం, డివైడర్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర మలుపుల వద్ద ప్రత్యేక గుర్తులు ఏర్పాటు చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని సూచించారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ పేర్కొన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగానే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎస్పీ జానకి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ముదిరాజ్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి : సీఎం కు సంజీవ్ ముదిరాజ్ విజ్ఞప్తి

మహబూబ్ నగర్, మే 8 (ప్రజా జ్యోతి బ్యూరో):

రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞనేశ్వర్ శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్

రెడ్డి ను కలిసి ముదిరాజ్ సామాజిక వర్గానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం బీసీ–డీ కేటగిరిలో సీరియల్ నంబర్ 19లో ఉన్న ముదిరాజ్ వర్గాన్ని బీసీ–ఏ కేటగిరిలోకి మార్చాలని కోరారు. దీంతో ముదిరాజ్ యువతకు విద్య, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలలో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, సామాజిక న్యాయం మరింత బలపడుతుందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సంజీవ్ ముదిరాజ్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి శేషాద్రిని ఈ అంశాన్ని సమగ్రంగా పరిశీలించి, ఎలాంటి న్యాయపరమైన లేదా పరిపాలనా ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారానికి మార్గాలను అధ్యయనం చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అదే విధంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీహరిలతో కలిసి బీసీ కమిషన్‌తో చర్చించి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సీఎం సూచించినట్లు తెలిపారు. ఇదే అంశంపై వివిధ రాజకీయ పార్టీల నేతలతో కూడా చర్చించాలని, ముఖ్యంగా కసాని జ్ఞనేశ్వర్, ఈటెల రాజేందర్, బండ ప్రకాశ్‌లతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రతినిధి బృందంలో హైదరాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిత్, టీపీసీసీ కార్యదర్శి వెంకటేశ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రణాళికలు,సంక్షేమ పథకాల అమలుకు గణన కీలకం: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 08(ప్రజా జ్యోతి ప్రతినిధి): జనాభా గణనలో పాల్గొనడం ప్రతి పౌరుడి

బాధ్యత అని,ప్రజల ఉజ్వల భవిష్యత్తు,అభివృద్ధి ప్రణాళికలు,సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు జనాభా గణన ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జనాభా గణన–2027 కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం కలెక్టరేట్ నుంచి కృష్ణవేణి చౌరస్తా వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఐడిఓసి వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.వివిధ శాఖల అధికారులు, యువత,విద్యార్థులు, ప్రజలు జనగణన

ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి,నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.కృష్ణవేణి చౌరస్తా వద్ద ర్యాలీ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ,ప్రతి పదేళ్లకు ఒకసారి నిర్వహించే జనాభా గణనకు విశేష ప్రాధాన్యత ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ జనాభా గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు సెల్ఫ్ ఎన్నుమరేషన్‌కు అవకాశం కల్పించినందున ప్రజలు పెద్ద ఎత్తున వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నుమరేటర్లు ఇంటింటికి తిరిగి మొదట గృహ గణన చేపడతారని,అనంతరం వచ్చే ఏడాది జనాభా గణన నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజలు ఎన్నుమరేటర్లకు సహకరించి అవసరమైన సమాచారాన్ని అందించాలని కోరారు. జిల్లాలోని అన్ని పురపాలక సంఘాలు,గ్రామాల్లో జనగణనపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రజలు అందించే సమాచారాన్ని పూర్తిగా గోప్యంగా ఉంచుతామని,ఎలాంటి సందేహాలు లేకుండా ప్రతి ఒక్కరూ జనాభా గణనలో భాగస్వాములు కావాలని సూచించారు.సంబంధిత శాఖల అధికారులు జనగణన విజయవంతం కావడానికి బాధ్యతాయుతంగా పనిచేయాలని,దేశాభివృద్ధికి ఈ గణన ఎంతో కీలకమని పేర్కొన్నారు.అనంతరం ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారి రాజు మాట్లాడుతూ, తలసేమియా వ్యాధి లక్షణాలు,నివారణ,చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,సీపీఓ పాపయ్య,వివిధ శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది,యువత,విద్యార్థులు,అంగన్‌వాడీ,ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్ సముదాయాన్ని సద్వినియోగం చేసుకోండి

– ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, మే 8 (ప్రజాజ్యోతి): సకల సదుపాయాలతో నిర్మించిన సమీకృత మార్కెట్ సముదాయాన్ని వ్యాపారులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కోరారు. వనపర్తి పట్టణంలోని పాత మార్కెట్ యార్డు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సమీకృత మార్కెట్

సముదాయంలోని మొదటి అంతస్తులో రిజిస్ట్రేషన్ అస్యూరెన్స్ కార్యాలయాన్ని శుక్రవారం రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవితో కలిసి ప్రారంభించారు. అర్చకులు వేదమంత్రాల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమీకృత మార్కెట్ సముదాయం పూర్తై సంవత్సరం దాటినా షాపుల అద్దెలు అధికంగా ఉండటంతో వ్యాపారులు ముందుకు రాలేదన్నారు. పరిస్థితిని గమనించి జిల్లా కలెక్టర్‌తో చర్చించి అద్దెలను సగానికి తగ్గించే ప్రతిపాదనలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పంపగా ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. షాపులు పొందిన రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది, దస్తావేజు రచయితలకు అభినందనలు తెలిపారు. ఇంకా డిమాండ్ ఉన్నందున అవసరమైన వారికి షాపులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. టౌన్ హాల్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి, పరిసర ఖాళీ స్థలంలో బంగారు దుకాణాలు నిర్మించి గోల్డ్ బజార్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న కొన్ని ప్రభుత్వ కార్యాలయాలను త్వరలో ప్రభుత్వ భవనాలకు మార్చనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్త కాపు శివసేనారెడ్డి మాట్లాడుతూ సమీకృత మార్కెట్‌లో షాపులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ దాదాపు ఏడాదిన్నరగా నిరుపయోగంగా ఉన్న సమీకృత మార్కెట్ సముదాయాన్ని ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో వినియోగంలోకి తీసుకువచ్చారని చెప్పారు. లాటరీ పద్ధతిలో పారదర్శకంగా షాపుల కేటాయింపు జరిగిందన్నారు. సాధారణంగా గ్రౌండ్ ఫ్లోర్ షాపులకే డిమాండ్ ఉంటుందని, పై అంతస్తులో రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో అన్ని షాపులకు ఆదరణ పెరిగిందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గత పాలకులు అసంపూర్తిగా వదిలిన భవనానికి అదనంగా రూ.23 లక్షలు వెచ్చించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకువచ్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ ఫణీంద్ర, సబ్‌రిజిస్ట్రార్ చంద్రశేఖర్, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం..

త్వరలో పాదయాత్ర : శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, మే 8 (ప్రజా జ్యోతి బ్యూరో)

మహబూబ్ నగర్ మండల పరిధిలోని రాంరెడ్డి గూడెం మిల్లు వద్ద వడ్లు అమ్మకం కోసం వాహనాల్లో ధాన్యం సంచులు పెట్టుకొని ఎదురు చూస్తున్న రైతులతో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడారు. రైతుల్లో భరోసా నింపేందుకు త్వరలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై త్వరలోనే పూర్తి ప్రణాళిక విడుదల చేస్తామని తెలిపారు. పాదయాత్ర ద్వారా ప్రతి రైతును

కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను వివరిస్తామని అన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి, సకాలంలో యూరియా, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి, రైతు బంధు విడుదల చేయాలి, పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు మరణిస్తే రైతు బీమా అమలు చేయాలని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేయాలని కోరారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని ప్రభుత్వంపై ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలను వదిలేసి సర్పంచులు, కార్పొరేటర్లు, ఇతర నాయకులను డబ్బులతో కొనుగోలు చేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వంతో కొనుగోళ్లు జరిపించే వరకు పోరాటం కొనసాగిస్తామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీఆర్ఎస్ వరంగల్ సభ ప్రకటించిన వెంటనే ప్రభుత్వం పాత విధానంలో పంట కొనుగోళ్లు ప్రారంభించిందని అన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల మిల్లర్లు రైతుల వద్ద నుంచి అధిక తరుగు తీసుకుంటున్నారని, రెండు నుంచి మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నట్లు రైతులు చెబుతున్నారని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సార్లు రైతు బంధు ఇవ్వకుండా ఎగ్గొట్టిందని, వ్యవసాయానికి సరిపడా విద్యుత్, యూరియా అందించలేదని విమర్శించారు. రైతులు కష్టపడి పంట పండించినా ప్రభుత్వం సకాలంలో కొనుగోలు చేయడం లేదని అన్నారు. అరకొర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తరువాత ఎత్తివేసిందని, దీంతో రైతులు మిల్లుల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు 40 కేజీలకు మూడు నుంచి నాలుగు కిలోల వరకు తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్లాల వద్దే వడ్లు కొనుగోలు చేశామని, తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమ చేశామని గుర్తుచేశారు. రైతు వారోత్సవాలు ఎందుకు నిర్వహిస్తున్నారో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల వడ్లు కొనక పోవడానికా, యూరియా ఇవ్వకపోవడానికా, కరెంటు సరఫరా చేయకపోవడానికా, పాలమూరు ప్రాజెక్ట్ పూర్తి చేయకపోవడానికా వారోత్సవాలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పరిష్కరించకుండా నాయకులను డబ్బులతో కొనుగోలు చేయాలని చూడటం మంచి పద్ధతి కాదని అన్నారు. రైతులు, ప్రజలు, విద్యార్థులను డబ్బులతో కొనలేరని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై పోరాటం చేసి ప్రభుత్వాన్ని మెడలు వంచించి పరిష్కారం సాధిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు రాజేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల మే 08(ప్రజా జ్యోతి ప్రతినిధి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ,తేదీ నుంచి నిర్వహించనున్న విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్

రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.విద్యా వారోత్సవాల నిర్వహణపై శుక్రవారం సాయంత్రం ఐడీఓసీ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,వారం రోజుల కార్యక్రమాలకు సంబంధించిన విధి విధానాలు ఇప్పటికే అందినందున షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.విద్యాసంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు మంజూరైనందున శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు.పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి మరుగుదొడ్ల నిర్మాణ పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి విద్యాశాఖ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని సూచించారు.పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ముఖ్యమైన సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు.అలాగే పదో తరగతి,ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన టాపర్ విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేయాలని సూచించారు.బడిబాట కార్యక్రమంతో పాటు విద్యా వారోత్సవాలన్నింటినీ షెడ్యూల్ ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో డీఐఈఓ హృదయరాజు,డీఈవో విజయలక్ష్మి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ సెల్ పదవులకు ఈ నెల 11 నుంచి దరఖాస్తులు

వనపర్తి, మే 8 (ప్రజాజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ జిల్లా, పట్టణ, మండల అధ్యక్ష పదవుల కోసం ఈ నెల 11 నుంచి 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఏఐసీసీ మైనార్టీ అబ్జర్వర్ మోయిజ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మైనార్టీ నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం వనపర్తి జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి

తొలిసారిగా వచ్చిన మోయిజ్‌కు మైనార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనరెడ్డి కూడా ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మండలాలు, మున్సిపాలిటీల్లో మైనార్టీ సెల్ కార్యకలాపాలు, నాయకుల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. కొత్త కార్యవర్గాల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని, ఆసక్తి ఉన్న ఆశావాహులు దరఖాస్తు చేసుకోవాలని మోయిజ్ సూచించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ రియాజుద్దీన్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, మాజీ జిల్లా అధ్యక్షుడు తైలం శంకర్ ప్రసాద్, మైనార్టీ నాయకులు ఎండి బాబా, కమ్మర్ రెహమాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ జిల్లా ప్రతినిధి, మే 08 (ప్రజాజ్యోతి) : రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కేంద్ర నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం, జిల్లాలోని చిల్పూర్ మండలంలోని చిన్న పెండ్యాల గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వడ్ల నాణ్యత, తేమ శాతం పరీక్షలు, బస్తాల నిల్వలు, హమాలీల సేవలు, రవాణా ఏర్పాట్లు, ట్రక్ షీట్, కాంటాలు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు కల్పిస్తున్న మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. రైతుల నుంచి ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేసి, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఎండల దృష్ట్యా రైతులకు తాగునీరు, నీడ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని నాణ్యతా ప్రమాణాల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి, ఎటువంటి ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. లారీల ద్వారా ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియ సకాలంలో చేపట్టాలని, లారీలలో ధాన్యం బస్తాలను వేగంగా నింపి, ఓ వ్యక్తి లారీతో పాటు సంబంధిత మిల్లులకు వెళ్లి, అక్కడ అన్ లోడింగ్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేసి సంబరాలు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు

ఎల్కతుర్తి మే 08 (ప్రజా జ్యోతి) : రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, హుస్నాబాద్ అంటే పొన్నం పొన్నం అంటేనే హుస్నాబాద్ అనే స్థాయిలో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన నాయకుడు మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అని కొనియాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి నియోజకవర్గానికి రాష్ట్రానికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పిసిసి సభ్యులు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ గొడిశాల యాదగిరి గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్ (బక్కి) సర్పంచులు బత్తిని రవీందర్ గౌడ్, ముప్పు శ్రీనివాస్, ఘన బోయిన రాజు యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, గొల్లపల్లి సంపత్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ బొల్లె పోగు రమేష్ బాబు, పులి కృష్ణ, వీరమల్లు రంజిత్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు గోడిశాల నరేష్ గౌడ్, మండ సుమన్ గౌడ్, కడారి రాజేందర్, శీలం అనిల్ కుమార్, బండి సుధాకర్ గౌడ్, మన్తుర్తి రాజయ్య, అడ్డూరి నవీన్, అడ్డూరి అనిల్, అడ్డూరి ప్రశాంత్, మైసా పవన్, గొడిశాల వినయ్ గౌడ్, ఠాగూర్ రామ్ సింగ్, కడారి సుధీర్, రామ్, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూల్చివేసిన పురాతన శివాలయాన్ని వెంటనే పునర్నిర్మించాలని డిమాండ్

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి
- "ధర్మాగ్రహ దీక్ష" ప్రారంభం
- వేద పండితులతో ఆలయ శుద్ధి

నర్సంపేట మే 8 (ప్రజాజ్యోతి) : నర్సంపేట నియోజకవర్గం,అశోక్ నగర్ గ్రామంలోని మట్టి కోటలో కాకతీయుల కాలం నాటి పురాతన శివాలయాన్ని అక్రమంగా కూల్చివేసిన నేపథ్యంలో,ఆ స్థలంలోనే శివాలయాన్ని తక్షణమే పునర్నిర్మించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ధర్మాగ్రహ దీక్ష కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ,శివాలయం కేవలం ఇటుకలు,రాళ్లతో కట్టడం కాదు.ఇది మన సంస్కృతి, భక్తి, విశ్వాసాలకు ప్రతీక. 700 ఏళ్ల చరిత్ర కలిగిన మట్టి కోట శివాలయాన్ని కూల్చివేయడం హిందూ సమాజ మనోభావాలపై జరిగిన దాడి.దీనికి ప్రభుత్వం వెంటనే స్పందించి,కూల్చిన స్థలంలోనే నిధులు విడుదల చేసి ఆలయ పునర్నిర్మాణం చేపట్టాలని డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు.నర్సంపేట నియోజకవర్గ ప్రజల చిరకాల కోరికను గౌరవించి పనులు ప్రారంభించే వరకు నా ధర్మాగ్రహ దీక్ష శాంతియుతంగా కొనసాగుతుంది. అని స్పష్టం చేశారు.అనంతరం దీక్షా స్థలంలో వేద పండితులతో ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.పండితులు వేద మంత్రాలతో,గంగాజలంతో ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి, శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.హర హర మహాదేవ జై శ్రీరామ్ నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.స్థానిక భక్తులు, శివభక్త సంఘాలు, హిందూ ఐక్య వేదిక, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డికి సంఘీభావం తెలిపారు.

కూల్చివేసిన కాంట్రాక్టర్, జేసీబీ డ్రైవర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి,ఆలయ నిర్మాణంపై ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చేవరకు మా పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో
పశు వైద్య, సంతానోత్పత్తి శిబిరం నిర్వహణ

- రైతులు పశుసంవర్ధక సేవలను సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ జిల్లా ప్రతినిధి, మే 08 (ప్రజాజ్యోతి) : పశువుల ఆరోగ్యమే రైతుల ఆర్థికాభివృద్ధికి బలం అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. శుక్రవారం, 99 రోజుల ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని ఘన్‌పూర్ స్టేషన్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పశు ఆరోగ్య, సంతానోత్పత్తి శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై, ఈ శిబిరాన్ని ప్రారంభించి, దూడలు, గొర్రెలు, మేకలకు నులిపురుగుల నివారణ మందులు వేయించారు. అనంతరం ఖనిజ మిశ్రమాన్ని రైతులకు పంపిణీ చేశారు. ఈ శిబిరం ద్వారా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించారు. ఇందులో భాగంగా మొత్తం 85 పశువులకు గాను వైద్య సేవలు అందించగా, 40 మంది రైతులు పాల్గొని ఈ సేవలను సద్వినియోగించుకున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధక రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిదని అన్నారు. పశువుల ఆరోగ్యం బాగుంటేనే రైతుకు ఆర్థికంగా లాభం చేకూరుతుందన్నారు. రైతులు పశువులకు సమయానికి టీకాలు వేయించడం, పోషకాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పశువుల్లో వ్యాధుల లక్షణాలు కనిపించిన వెంటనే సమీప పశు వైద్య అధికారులను సంప్రదించాలని కోరారు. సంతానోత్పత్తి సేవలను సద్వినియోగం చేసుకొని, పాల ఉత్పత్తి, పశు సంపదను పెంచుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం పశుసంవర్ధక రంగ అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, రైతులు వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రైతులకు పశుసంవర్ధక రంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశువుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారి మురళీధర్ రావు, ఏడీలు, ఏవీహెచ్ ఘన్‌పూర్ స్టేషన్, తిమ్మంపేట, జనగామ, ఎంఏహెచ్ఓ ఘన్‌పూర్ స్టేషన్, వీఏఎస్ మల్కాపూర్, పారావెట్స్, గోపాలమిత్రలు, తదితరులు పాల్గొన్నారు.

జనగణన ప్రతి పౌరుడి బాధ్యత

- సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది
- జనగణనపై అవగాహనకు వాక్ కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ జిల్లా ప్రతినిధి, మే 08 (ప్రజాజ్యోతి) : జనగణన ప్రతి పౌరుడి బాధ్యత అని, సమగ్ర సమాచారం దేశాభివృద్ధికి పునాది అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. జనగణనపై జిల్లా ప్రజలకు అవగాహన కల్పించేందుకు గాను శుక్రవారం ఉదయం ఐడిఓసీ కార్యాలయం నుంచి నెహ్రూ పార్క్ వరకు జనగణన అవగాహన వాక్" ను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జనగామ మునిసిపల్ చైర్పర్సన్ కడకంచి బాలమణి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లు హాజరై, జనగణన అవగాహన వాక్ ను జెండా ఊపి ఆరంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనగణన ప్రక్రియలో భాగంగా స్వీయ గణన విధానం మే 10 వరకు జరుగుతుందని, ఈ స్వీయ గణనలో ఇప్పటివరకు ఐదు వేల మంది నమోదు చేసుకున్నారని, ఈ స్వీయ నమోదు శాతాన్ని మరింతగా పెంచాలని, అందరూ ఈ స్వీయ గణనలో నమోదు చేసుకోవాలని కోరారు. అలగే మే 11వ తేదీ నుంచి ఇళ్ల గణన ప్రక్రియ ప్రారంభం అవుతుందని, ఇందులో మొత్తం 34 ప్రశ్నలు ఉంటాయని, ఈ వివరాలు అంతా కూడా గోప్యంగా ఉంటుందని, అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని, ప్రజలు ఎటువంటి భయం పడాల్సిన అవసరం లేదని, దీనికి సంబంధించిన సహాయ కేంద్రం కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా జనగణనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నిర్వహించిన అవగాహన వాక్‌లో అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. అనంతరం మునిసిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి కుటుంబం సరైన వివరాలు అందించి జనగణన విజయవంతానికి సహకరించాలని కోరారు. తదనంతరం డీసీపీ మాట్లాడుతూ జనగణన ద్వారా ప్రభుత్వానికి ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దోహదపడుతుందని తెలిపారు. దేశ అభివృద్ధికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతో అవసరమని, "మన సమాచారం -- మన భవిష్యత్తు" అనే భావనతో ప్రతి ఒక్కరూ జనగణన కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు గోపీరాం, వెంకన్న, డీఏఓ అంబికా సోనీ, ఉద్యానవన శాఖ అధికారి రవికాంత్, వైద్య శాఖ అధికారి మల్లికార్జున రావు, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఇతర వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, ఐడిఓసీ సిబ్బంది, యువత, విద్యార్థులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రైతు వారాన్ని తూతూ మంత్రంగా నిర్వహించిన ఇరిగేషన్ అధికారులు..!

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై రైతుల ఆగ్రహం

పర్వతగిరి, మే 08 (ప్రజాజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించాల్సిన రైతు వారోత్సవ సమావేశాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల శాఖ ,ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మండల వ్యాప్తంగా రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, పర్వతగిరి మండలంలో మాత్రం కార్యక్రమం నామమాత్రంగా నిర్వహించారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తూముల నిర్వహణ బాధ్యతలు చూసే వీఆర్ఏలకు సమాచారం ఇచ్చి పెద్ద ఎత్తున రైతులతో సభ నిర్వహించాల్సి ఉండగా, ఎలాంటి సమగ్ర సమాచారమూ ఇవ్వకుండా కొద్దిమందితోనే కార్యక్రమం ముగించారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తక్కువ ధరకు జీలుగు విత్తనాలు అందిస్తున్నాం అంటూ కొందరిని పిలిచి, కేవలం ఆరుగురు రైతులతోనే సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. రైతుల సమస్యలు, సాగునీటి ప్రణాళికలు, చెరువుల పునరుద్ధరణ, ఆయకట్టు అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చ జరగకపోవడం రైతుల్లో అసంతృప్తిని పెంచింది. ఇరిగేషన్ డీఈ రాజుపై గతంలో కూడా పలు ఆరోపణలు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు పట్టించుకోలేదని మండల వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. గత ఏడాది పర్వతగిరి మండలంలోని రిజర్వాయర్,పలు చెరువులలో చేపల వేట కోసం నీటిని వృథాగా వదిలిపెట్టిన ఘటనలపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చిదురు శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సమాచారం ఇవ్వలేదు యువరైతు పోకల శంకర్ : యువరైతు పోకల శంకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించాల్సిన రైతు సమావేశాలకు మండలంలోని రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఆరోపించారు. కొందరితో మాత్రమే సమావేశం నిర్వహించి అధికారిక కార్యక్రమంగా చూపించడం సరైంది కాదన్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆకాశవాణి వాకథాన్ విజయవంతం..

- స్టేషన్ హెడ్ ఇల్లందుల రవికుమార్..
- ఆకాశవాణికి దేశంలోనే ప్రత్యేక స్థానం..
- అడిషనల్ డైరెక్టర్ డా.ఆర్.ఉమా రెడ్డి..

హనుమకొండ జిల్లా ప్రతినిధి మే8 (ప్రజాజ్యోతి) : ఆకాశవాణి వాకథాన్ విజయవంతం అయ్యిందని ఆకాశవాణి వరంగల్ కేంద్రం కార్యక్రమ నిర్వహణ అధికారి, ప్రోగ్రాం హెడ్, స్టేషన్ ఇంచార్జ్ ఇల్లందుల రవికుమార్ అన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఆకాశవాణి 90 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా శుక్రవారం ఉదయం వాక్ థాన్ నిర్వహించారు. ఆకాశవాణి ప్రాంగణం నుంచి ప్రారంభమైన వాక్ థాన్ కాకతీయ యూనివర్సిటీ మొదటి గేటు వరకు సాగి మళ్లీ ఆకాశవాణిని చేరుకున్నదన్నారు. విపత్కర పరిస్థితుల్లో సైతం ఆకాశవాణి సేవలు అద్వితీయమన్నారు. స్థానికంగా ఉన్నటువంటి కవులు, రచయితలు,కళాకారులు మరియు వివిధ విభాగాల్లో పని చేస్తున్నటువంటి ప్రతిభావంతులతో, నిష్ణాతులతో పలు రకాల కార్యక్రమాలను అందించి వరంగల్ ఆకాశవాణి అందరి మన్ననలు పొందిందని అన్నారు. ఆకాశవాణి వరంగల్ కేంద్రానికి దేశంలోనే ప్రత్యేక స్థానం ఉందని, స్థానికంగా ఉన్నటువంటి ఎంతోమంది మేధావులు సైతం ఆకాశవాణి ద్వారా పలు కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారని,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఆకాశవాణి సేవలు అద్వితీయమని కొనియాడారు. 90 వసంతాల వేడుకల్లో గత 11 నెలలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలను వాక్ థాన్ ద్వారా ప్రజలకు పునరంకితం కావాలని ఆశయంతో ఉన్నామని,జూన్ 8వ తేదీ వరకు ఇటువంటి వినూత్న ,సృజనాత్మక కార్యక్రమాలు మరెన్నో శ్రోతలకి అందించనున్నామని తెలిపారు.గౌరవ అతిథిగా వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకులు డాక్టర్ ఉమా రెడ్డి హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆకాశవాణి అనేక కార్యక్రమాలను రైతులకు చేరువ చేయడంలో ఇక్కడ ఉన్నటువంటి శాస్త్రవేత్తలు, అధికారులు ఎంతగానో తోడ్పడుతున్నారని, మునుముందు రైతులకు మరిన్ని కార్యక్రమాలు అందించాలని అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం పి.ఆర్.ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనీ ఆకాశవాణితో తన చిరకాల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశవాణి సిబ్బంది శ్రీనివాస్, శివ, నరేష్, విజయలక్ష్మి, శ్రీనివాసరాజు, శ్రీనివాస చారి, ఉషశ్రీ, రామ్మూర్తి, రామ్మోహన్, అనిల్ ప్రసాద్‌తో పాటు వ్యాఖ్యాతలు, విశ్రాంత ఉద్యోగులు, శ్రోతలు, వి ద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర రెండవ ఆర్థిక సంఘం ప్రాంతీయ వర్క్‌షాప్ ప్రారంభం..

హనుమకొండ జిల్లా ప్రతినిధి మే 8 (ప్రజాజ్యోతి) : హనుమకొండ ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రెండవ ఆర్థిక సంఘం ఆధ్వర్యంలో సెంట్రల్ తెలంగాణ ప్రాంతీయ వర్క్‌షాప్ శుక్రవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కమిషన్ సభ్యులు సుధర్ రెడ్డి, మెంబర్ సెక్రటరీ కాత్యాయిని, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి హాజరైయ్యారు. వర్క్‌షాప్‌లో మెదక్, సిద్ధిపేట, సంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ములుగు, జనగాం జిల్లాలకు చెందిన అధికారులతో విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా, వ్యవసాయం, గ్రామీణ మరియు పట్టణాభివృద్ధి, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా జిల్లాల అదనపు కలెక్టర్లు, జెడ్పీ సీఈఓలు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, మాజీ జెడ్పీ చైర్పర్సన్లు, మాజీ జెడ్‌పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మాదారం సింగిల్ విండో చైర్మన్‌గా నల్లెల్ల లింగమూర్తి బాధ్యతలు..

పరకాల, మే 8 (ప్రజాజ్యోతి) : మాదారం సింగిల్ విండో (పీఏసీఎస్) చైర్మన్‌గా నల్లెల్ల లింగమూర్తి మరోసారి బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం పాలకవర్గం తిరిగి బాధ్యతలు స్వీకరించింది. 2025 ఫిబ్రవరి 14తో సింగిల్ విండో కమిటీ పదవీకాలం ముగియగా ప్రభుత్వం మొదట ఆరు నెలలు, అనంతరం మరో ఆరు నెలల పాటు పదవీకాలాన్ని పొడిగించింది. మధ్యలోనే 2025 డిసెంబర్ 19న పాలకవర్గాన్ని రద్దు చేసి అధికారులను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనిపై పలువురు చైర్మన్లు హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు ఆదేశాల మేరకు పాలకవర్గాలు తిరిగి బాధ్యతలు స్వీకరించాయి. ఈ సందర్భంగా డైరెక్టర్లుగా కొమ్మిడి రాజిరెడ్డి, జంగిలి రాజనర్సయ్య, డైగా రాజు, రావుల విజేందర్ రెడ్డి, దోమ ప్రమీల, కేథరీ రాజమ్మ, నల్ల నిర్మల రాజిరెడ్డి, ఊర సతీష్ రావు, బోట్ల వినయ్ తిరుపతి, విజయ సమ్మిరెడ్డి బాధ్యతలు చేపట్టారు. చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి మాట్లాడుతూ.. రైతుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. మాదారం సొసైటీ పరిధిలోని రైతులు తమ మక్కలు, వరి ధాన్యాన్ని సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మజ్జ్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ

జనగామ జిల్లా ప్రతినిధి మే 08, (ప్రజాజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు, శుక్రవారం ఘనపూర్ స్టేషన్, జనగామ, పాలకుర్తి నియోజకవర్గ పరిధిల్లోని రైతు వేదికల వద్ద మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య ఉత్పత్తి పెంపు, చెరువుల సమర్థ నిర్వహణ, చేపల వ్యాధుల నివారణ, కలుపు నియంత్రణ చర్యలు, ఆధునిక చేపల పెంపక విధానాలపై మత్స్యకారులకు అధికారులు వివరించారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాలు, చేప పిల్లల వితరణ, నీటి వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు, మత్స్యకార సంఘాల సభ్యులు, మత్స్యకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి

రాయపర్తి, మే 8 ప్రజా జ్యోతి : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కొత్తూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాన గట్టయ్య కూతురు, మరియు శెట్టి శ్రీశైలం కుమారుడు శ్యామల - సంతోష్ వివాహ వేడుకలో శుక్రవారం పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి,ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు అందించిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, మాజీ సర్పంచ్ కందికట్ల స్వామి, ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్, పార్టీ ముఖ్య నాయకులు దొమ్మటి సుభాష్, పాలేపు శ్రీనివాస్, విరగంధం శ్రీనివాస్, నాల్లం రామస్వామి, కందికట్ల శ్రీనివాస్, రామకృష్ణ, బొమ్మిదేని నారాయణ, నల్లబెల్లి హరి తదితరులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టు వరకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు

తుంగతుర్తి, మే 8,(ప్రజా జ్యోతి):
చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని దేవుని గుట్ట తండా గ్రామంలో నీటిపారుదల ఆయకట్టు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ అధ్యక్షతన రైతు వారము కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు హాజరై మాట్లాడారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం విశ్వసించి రైతును రాజును చేయడమే లక్ష్యంగా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించడంతోపాటు, రైతు రుణమాఫీ, బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిది అన్నారు. ఆర్డిఆర్ ఎస్సారెస్పీ పేస్ – 2 కాలువ ద్వారా తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత శాసనసభ్యులు మందుల సామెల్ సహకారంతో వేసవి పంటకు నీరు అందించి రైతన్నలను ఆదుకున్నారని తెలిపారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సక్రమంగా కొనుగోలును చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

మోడం సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ... ఈ నియోజకవర్గంలో రెండు లక్షల పద్నాలుగు వేల ఎకరాలకు ఎస్సారెస్పీ మెయిన్ కెనాల్ ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి వానకాలం యాసంగి సీజన్ లో అనుకున్న దానికంటే 100% నీరు అందిస్తున్నట్లు తెలిపారు. పోయిన వానకాలం సీజన్లో కొన్ని చెక్ డ్యాములు ఆడవగా వాటిని డిసెంబర్ 23 కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి ఈరోజు వరకు మన నియోజకవర్గంలో 38 కోట్ల రూపాయలు మంజూరు చేసి వాటిని రిపేర్ చేస్తున్నట్లు తెలిపారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ సహకారంతో అధిక నిధులు నీటిపారుదల శాఖకు తీసుకురావడం జరిగిందని తెలిపారు. కొన్ని చెక్ డ్యాములకు, చెరువులకు అభివృద్ధి పనులకు గాను ఎస్టిమేట్ వేసి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. న్యూ స్కాంక్షన్లోని అందరి భాగస్వామ్యం వల్ల ప్రతి సీజన్లో చెరువులకు ఎస్సారెస్పీ నీటిని నింపుకుంటున్నట్లు తెలిపారు. రైతు నీటిని సద్వినియోగం చేసుకొని పంటలను మంచిగా పండించుకుంటే మనమందరం బాగుంటామని తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని తెలిపారు. తొలుత జాతీయ గీతాన్ని ఆలపించిన

అనంతరం, ముఖ్యమంత్రి సందేశాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యనారాయణ చదివి వినిపించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుగులోతు స్వాతి భాస్కర్, తుంగతుర్తి, మద్దిరాల, నూతనకల్ సబ్ డివిజన్ ఇంజనీర్ కిష్టయ్య,నాగారం సబ్ డివిజన్ ఇంజనీ సునీత,తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, వెంపటి గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య, ఏఈ లు సతీష్, హరీష్, కళ్యాణ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మణికుమార్, అగ్రికల్చర్ ఏఈఓ జోత్స్న, వీఆర్వో మౌలానా,ఎస్సారెస్పీ లస్కర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రైతులను అంధకారంలో నెట్టింది

నార్కట్ పల్లి, మే 8 (ప్రజా జ్యోతి):
నార్కట్పల్లి పట్టణ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ శాసన సభ్యులు చిరుమర్తి లింగయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుల తరబడి కళ్ళల్లో ఉన్న ధాన్యపు రాశులను పరిశీలించి ఆయన, అక్కడ ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన

నాటి నుంచి రైతన్నల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని ఆయన విమర్శించారు. ప్రభుత్వం వడ్ల కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సరిపడా లారీలు లేక రైతులు ధాన్యాన్ని తరలించేందుకు చాలా కష్టాలు పడుతున్నారని, బస్తాకు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే వడ్ల కొనుగోలుప్రారంభించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఊదుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి కర్ణాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి మేకల రాజిరెడ్డి, మేడ బోయిన రాంబాబు, బొక్క భూపాల్ రెడ్డి, ఎండి జానీ, దుబ్బ రవి కుమార్, పుల్లెంల వెంకట్, పాల్గొన్నారు.

బి.ఆర్.ఎస్ కండువా కప్పుకున్న వారికి తప్ప సామాన్యులకు దళిత బంధు ఇచ్చారా ?

254 మంది లబ్ధిదారుల కుటుంబాల్లో ఎంత మంది నిరుపేదలు ఉన్నారో నిరూపించాలి

ఎమ్మెల్యే సామెల్ దళిత బంధు అడ్డుకుంటున్నాడు అనడం మూర్ఖత్వం

యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్

మోత్కూరు, మే 8 (ప్రజా జ్యోతి):
గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకంలో ఆ పార్టీ కండువా కప్పుకున్న వారికి తప్ప సామాన్యులకు ఎంత మందికి దళిత బంధు అమలు చేశారు ఆ పార్టీ నాయకులు

తెలపాలని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి మందుల సురేష్ అన్నారు. శుక్రవారం ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ దళిత బంధు పథకాన్ని అడ్డుకుంటున్నాడని ఎమ్మెల్యే మందుల సామెల్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే తాము చూస్తూ ఊరుకోమన్నారు. మోత్కూరు, అడ్డగుడూరు మండలాల్లో
254 దళిత బంధు కుటుంబాలలోఎంత మంది నిరుపేదలు ఉన్నారో నిరూపించాలని సవాల్ చేశారు. ఇటీవల ఒక వ్యక్తి ఎమ్మెల్యే వద్దకు వచ్చి ఉస్మానియా యూనివర్సిటీ అనగానే ఎమ్మెల్యే మందుల సామెలు గౌరవించి మాట్లాడితే సంస్కారం లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సదరు వ్యక్తి ముషిపట్ల గ్రామంలో మైక్రో ఫైనాన్స్ పేరుతో దళితుల నుండి లక్షల రూపాయలు వసూలు చేసి హైద్రాబాద్ కు తట్టాబుట్టా సర్దుకొని పోయి ఊళ్ళోకి వచ్చే మొఖం లేక తప్పించుక తిరిగేటోడు ఎమ్మెల్యే గురించి మాట్లాడుతుంటే ముశిపట్ల గ్రామస్తులే నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు గడ్డం లక్ష్మయ్య, కందుకూరి మురళి, చిప్పలపల్లి స్వామి, కందుకూరి నరసింహ, గడ్డం రమేష్, బుశిపాక సత్తయ్య, జంగ సోమరాజు ఉన్నారు.

దాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

మోత్కూరు, మే 8 (ప్రజా జ్యోతి):
అరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి రైతులు నానా ఇబ్బందులు పడుతుంటే సమస్యను పరిష్కరించవలసిన ప్రభుత్వం "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక " పేరుతో ఉత్సవాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు

వెంకటనర్సు ప్రశ్నించారు. శుక్రవారం మోత్కూర్ మండలం పాటిమట్ల గ్రామంలో పార్టీ నాయకులతో కలసి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు కోతలు పూర్తి చేసి దాన్యాన్ని కళ్ళాల్లో కుప్పలుగా నిల్వ చేసి కొనుగోలు కోసం రైతులు ఆందోళన చెందుతుండగా, మరోవైపు వాతావరణ మార్పులు, అకాల వర్షాలు రైతులను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సమయంలో రైతుల సమస్యలను పరిష్కరించవలసిన ప్రభుత్వం వారోత్సవాలు నిర్వహిస్తే రైతులు సంతోషంగా ఎలా పాల్గొంటారని అన్నారు. తేమ, తరుగు పేరుతో రైతులు దోపిడీకి గురికాకుండా మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, కురిమేటి యాదయ్య, రాచకొండ కనకయ్య, శాఖ సభ్యులు బండి రవి, దొండ నాగరాజు, అన్నవరం నారాయణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులు ఉద్యోగాల కొరకు దరఖాస్తు చేసుకోండి

కుంభం ఫౌండేషన్ చైర్మన్ కీర్తి రెడ్డి

భువనగిరి,మే 8(ప్రజాజ్యోతి):
ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మరియు, కుంభం ఫౌండేషన్ చైర్పర్సన్, కుంభం కీర్తిరెడ్డి ఆధ్వర్యంలో భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించ బడుతోంది.ఈ జాబ్ మేళా మే 8,9,10,తేదీలలో,భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ పాఠశాల ప్రాంగణంలో జరుగనుంది.దేశవ్యాప్తంగా యువతకు ఉపాధి అవకాశాలు,కల్పిస్తున్న ప్రముఖ 1ఎం,1బి,సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మెగా జాబ్ మేళాలో సుమారు,25 ప్రముఖ కంపెనీలు పాల్గొని దాదాపు 3500 ఉద్యోగ అవకాశాలను అందించ నున్నాయి.ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కుప్పం,కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ ప్రాంతాల్లో విజయ వంతంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన 1ఎం,1బి,సంస్థ,ఇప్పుడు తెలంగాణ యువత కోసం రాష్ట్రంలో మొట్టమొదటిసారి యాదాద్రి భువనగిరిని వేదికగా ఎంచుకోవడం విశేషంగా నిలిచింది. ఇంటర్మీడియట్, డిగ్రీ,బీటెక్ ఐటీఐ, డిప్లొమా మరియు ఇతర అర్హతలు కలిగిన యువతకు ఈ జాబ్ మేళా ద్వారా వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ప్రైవేట్ రంగంలోని ప్రముఖ కంపెనీలు ప్రత్యక్షంగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. జాబ్ మేళా మొదటి రెండు రోజులు అయిన మే 8, 9 తేదీలలో అభ్యర్థుల స్క్రీనింగ్, సర్టిఫికెట్ల పరిశీలన మరియు టోకెన్ కేటాయింపు ప్రక్రియ నిర్వహించ బడుతుంది.అనంతరం మే 10వ,తేదీన ప్రధాన ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నారు. అలాగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతకు ప్రత్యేకంగా గైడెన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ మరియు ఇంటర్వ్యూ ప్రిపరేషన్పై అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భువనగిరి ఎమ్మెల్యే,కుంభం అనిల్ కుమార్ రెడ్డి,మాట్లాడుతూ యువత ఉద్యోగ అవకాశాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితుల్లో ప్రముఖ కంపెనీలే జిల్లా కేంద్రానికి వచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం శుభపరిణామమని అన్నారు.. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్వహి స్తున్న ఈ

మెగా జాబ్ మేళా వేలాది మందికి ఉపాధి మార్గాన్ని చూపుతుందని తెలిపారు. గత కొద్దిరోజులుగా ఈ కార్యక్రమం విజయవంతం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వాలంటీర్లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మే,10వ తేదీన నిర్వహించనున్న ప్రధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి యువత,ప్రజలు మరియు నిర్వాహకులు అందరూ సమన్వయంతో ముందుకు రావాలని కోరారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. యువత తమ భవిష్యత్తును నిర్మించుకునే ఈ సువర్ణ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ మేళాకు భారీ సంఖ్యలో యువత హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుంభం ఫౌండేషన్ నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్, భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,పోచంపల్లి మున్సిపల్ చైర్మన్ వార్డ్ కౌన్సిలర్ భువనగిరి పట్టణ మండల,గ్రామాల ప్రజా ప్రతినిధులు,సీనియర్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,మహిళా కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మే 10న జరిగే బిజెపి బహిరంగ సభను విజయవంతం చేయాలి

మోత్కూరు, మే 8 (ప్రజా జ్యోతి):
ఈనెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో నిర్వహించనున్న బిజెపి బహిరంగ సభను పార్టీ నాయకులు కార్యకర్తలు బిజెపి అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య కోరారు. శుక్రవారం మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన

పాల్గొని మాట్లాడారు. ఈ బహిరంగ సభకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరవుతారని తెలిపారు.
తెలంగాణలో రూ.7823 కోట్ల విలువ గల పలు అభివృద్ధి కార్యక్రమాలకు నరేంద్ర మోడీ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఇందులో జహీరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, రూ.3175 కోట్ల విలువ గల గుడెబెల్లేరు నుంచి మహబూబ్ నగర్ వరకు జాతీయ రహదారి, కాజీపేట, పెద్దపల్లి బైపాస్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.1243 కోట్లతో కాజీపేట – విజయవాడ మూడో లైన్ రైలు మార్గం, పీఎం మిత్ర టెక్స్ టైల్ పార్క్ నిర్మాణ పనుల ప్రారంభం వంటివి ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గుదే మధుసూదన్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు, పనకబండ ఉప సర్పంచ్ రాదారపు మల్లేశం, గుంటి సతీష్, నాయకులు సింగిరెడ్డి పురుషోత్తం రెడ్డి, భూత్ అధ్యక్షులు ముక్కాముల గణేష్, నాయిని ఉపేందర్ తదితరు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

హాలియా, మే8(ప్రజా జ్యోతి):
భద్రతా పరంగా సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని హాలియా ఎస్ ఐ సాయి ప్రశాంత్ అన్నారు. శుక్రవారం అనుముల మండలంలోని వెంకటాపురం స్టేజీ జాతీయ రహదారి 565 వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు మారుపాక గ్రామానికి చెందిన మేరెడ్డి వెంకట్ రెడ్డి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 6 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వాటిని ఎస్ఐ ఎస్ ఐ సాయి ప్రశాంత్ ప్రారంభించి మాట్లాడారు.ప్రజల భద్రత కోసం ఇలాంటి చర్యలు ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా రహదారిపై వాహనాల రాకపోకలు స్పష్టంగా కనిపించే విధంగా కెమెరాలను అమర్చడం అభినందనీయమన్నారు.సీసీ కెమెరాలతో అనుమానస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి నేరాలను అరికట్టవచ్చని తెలిపారు.సమాజ భద్రతకు ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని సూచించారు.కార్యక్రమంలో నిడమనూర్ ఎస్ ఐ ఉప్పు సురేష్,పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అప్పు తీర్చమన్నందుకు మరదల్ని హత్య చేసిన బావ

- **సహకారం అందించిన హంతకుడి భార్య**
- **శ్రీశైలం అడవుల్లోకి డెడ్‌బాడీ తరలింపు**
- **200 అడుగుల లోయలో తగలబెట్టిన నిందితులు**
- **హత్య అనంతరం కాశీకి వెళ్లిన దంపతులు**

అనంతగిరి మే 8 (ప్రజాజ్యోతి):
సూర్యాపేట జిల్లాలో దారుణమైన కుటుంబ హత్య కేసు వెలుగులోకి వచ్చింది. బాకీ డబ్బులు అడిగినందుకు సొంత మరదల్నే బావ హత్య చేసిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టిస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం, అనంతగిరి మండలం మొగులాయి కోట గ్రామానికి చెందిన మహిళ తనకు రావలసిన బాకీ డబ్బుల విషయమై తరచూ అడుగుతుండేది. ఈ విషయం కుటుంబంలో ఉద్రిక్తతకు దారితీసింది. ఇదే ఆగ్రహానికి కారణమై, హుజూర్నగర్ మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన గోవిందు అనే వ్యక్తి తన భార్య మహాలక్ష్మితో కలిసి కుట్ర పన్ని హత్యకు పాల్పడినట్టు సమాచారం. ఈ ఘటన హుజూర్నగర్ మండలం రాయని గూడెం సమీపంలో జరిగినట్లు తెలిసింది. ముందుగా బాధితురాలిని

హత్య చేసిన అనంతరం, మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి శ్రీశైలం అడవుల్లోకి తరలించారు. అక్కడ సుమారు 200 అడుగుల లోయలో పడేసి, పెట్రోల్ పోసి మృతదేహాన్ని తగలబెట్టినట్లు పోలీసులు గుర్తించారు. అంతేకాకుండా, హత్య అనంతరం ఎవరికి అనుమానం రాకుండా ఉండేందుకు నిందిత దంపతులు కాశీకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటన సూర్యాపేట జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. కుటుంబ బంధాలను మరిచి, బాకీ డబ్బుల కోసం జరిగిన ఈ హత్య స్థానికంగా తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ప్రారంభం

అనంతగిరి మే 08 (ప్రజాజ్యోతి):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళిక లో భాగంగా అనంతగిరి గ్రామంలోని పశువైద్య ఉపకేంద్రంలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ నకిరకంటి వీరభద్రమ్మ ప్రారంభించారు. మేలు జాతి దూడల ప్రదర్శనలో పాల్గొని బహుమతులు అందజేశారు. అర్హులైన పాడి రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు. ఉపసర్పంచ్ గవిని రామకృష్ణ మాట్లాడుతూ పశు వైద్య ఉపకేంద్రంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతగిరి మండల పశువైద్యాధికారి డాక్టర్ సురేంద్ర మాట్లాడుతూ ఈ శిబిరంలో 40 పశువులకు చూడి పరీక్షలు, గర్భకోశ వ్యాధి నివారణ చికిత్సలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ వేసవి కాలంలో వేడి నుంచి పశువులను సంరక్షించుకోవడానికి పాడి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు, లైవ్ స్టాక్ అసిస్టెంట్ హుస్సేన్, శరత్ గోపాల మిత్రులు రవీందర్, గోపాల్ రావు, సరిత, నజీర్, గ్రామస్తులు వంశీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మన ఊరు - మన భద్రత, మన బాధ్యత

సిరికొండ (ప్రజ జ్యోతి)మే 8 ఈ రోజు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కొండాపూర్ గ్రామములో "మన ఊరు మన భద్రత, మన బాధ్యత" కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఎస్సై జైడి రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్య ఉద్దేశ్యం గ్రామ ప్రజల్లో భద్రతాపై అవగాహన పెంపొందించడం మరియు ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రోత్సాహం కల్పించడం. కార్యక్రమంలో పోలీసు అధికారులు ప్రజలకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, పిల్లల రక్షణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం పొందే విధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు తమ పరిసరాలలో అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామ భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు మరియు స్థానిక ప్రజలు పాల్గొని పోలీసులకు తమ సహకారం అందించారు. ప్రజలు కూడా తమ గ్రామ భద్రత కోసం అప్రమత్తంగా ఉండి పోలీసులతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. "సురక్షిత గ్రామం -- సుభిక్ష సమాజం" అనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

గ్రామ పరిశుభ్రతకు ప్రజల
సహకారం అవసరం: సర్పంచ్ ఎర్రం సిలిండర్ లింగం
– ప్రత్యేక చెత్త డ్రంలు ఏర్పాటు చేసిన నందిపేట్ జీపీ

(ప్రజాజ్యోతి – నందిపేట్) నందిపేట్ గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా ఉంచడంలో గ్రామ ప్రజలందరూ సహకరించాలని నందిపేట్ సర్పంచ్ ఎర్రం సిలిండర్ లింగం కోరారు. గ్రామంలో స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేకంగా తయారు చేసిన చెత్త డ్రంలను శుక్రవారం ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను తప్పనిసరిగా చెత్త డ్రంలలోనే వేయాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన సమాజానికి నాంది అవుతుందని అన్నారు. గ్రామంలో స్వచ్ఛతపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామ్‌చందర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

వేదం ఒలంపియాడ్
స్కూల్‌కు అనుమతులు లేవు: ఎంఈవో

(ప్రజాజ్యోతి – నందిపేట్) "వేదం ఒలంపియాడ్ స్కూల్" పేరిట ఎటువంటి అధికారిక అనుమతులు లేవని నందిపేట్ మండల విద్యాశాఖ అధికారి శుక్రవారం కీలక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రులు ఎవరూ కూడా ఆ పాఠశాలలో తమ పిల్లలకు అడ్మిషన్లు తీసుకోవద్దని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని గుర్తింపు పొందిన పాఠశాలల్లోనే ప్రవేశాలు కల్పించాలని కోరారు. ఈ విషయంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఈవో సూచించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు
మే 11 నుండి వేసవి శిక్షణ శిబిరాలు

కమ్మర్ పల్లి (ప్రజాజ్యోతి) మే 8 : ప్రభుత్వ మరియు రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల ప్రకారం ఈ నెల 11వ తేదీ నుండి 25వ తేదీ వరకు 15 రోజుల పాటు ప్రతి పీఎంశ్రీ పాఠశాలలో 6వ తరగతి నుండి 9వ తరగతి చదివే విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి నేర ఆంధ్రయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పీఎంశ్రీ జెడ్పిహెచ్ఎస్ చౌట్ పల్లి మరియు కొనసముందర్ పాఠశాలల్లో ఈ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇట్టి వేసవి శిక్షణ తరగతులకు ఆయా పాఠశాలల విద్యార్థులతో పాటు, దగ్గరలో ఉన్న ఇతర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా హాజరుకావచ్చని వివరించారు. విద్యార్థులు ఈ 15 రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకొని తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని ఆయన కోరారు.

పీఎంశ్రీ జిల్లాపరిషత్ విద్యార్థుల సమ్మర్ క్యాంప్

ప్రజాజ్యోతి, ఏర్గట్ల: ఏర్గట్ల మండల కేంద్రంలోని పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు కొమరగిరి కృష్ణాచారి తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్ మే 11 నుండి మే 25 వరకు ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. 6వ తరగతి నుండి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈ క్యాంప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. ఏర్గట్ల మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ విద్యార్థులు అందరూ ఈ సమ్మర్ క్యాంప్ కి హాజరు కావచ్చని స్పష్టం చేశారు. విద్యార్థులలో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించినట్లు వివరించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో సంగీతం, నృత్యం, చిత్రలేఖనం, కథలు చెప్పడం, చెస్ మరియు ఇండోర్ గేమ్స్ వంటి పలు ఆసక్తికర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. అదనంగా విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు వివరించారు. సరదాతో కూడిన అభ్యాస వాతావరణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పిల్లల ప్రతిభను వెలికితీయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. సుమారు 100 మంది విద్యార్థులను మాత్రమే క్యాంప్ లో చేర్చుకోనున్నట్లు వివరించారు. కావున తల్లిదండ్రులు త్వరపడాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సహా మరిన్ని వివరాల కోసం 98485 12511 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

ఇందల్వాయి సొసైటీ
చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న గోవర్ధన్

ఇందల్వాయి(ప్రజా జ్యోతి) మే. 7 ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామ వ్యవసాయ సహకార సంఘం (సొసైటీ) చైర్మన్ల పదవీకాలం ఇటీవల ముగియడంతో. హై కోర్ట్ తీర్పు మేరకు జిల్లాలోని అన్ని సొసైటీల చైర్మన్ లను డైరెక్టర్లను ఎన్నికలు జరిగే వరకు తిరిగి బాధ్యతలు అప్పగించడం జరిగింది. ఈ క్రమంలో ఇందల్వాయి సొసైటీ చైర్మన్గా గోవర్ధన్ కు మరోసారి బాధితులు అప్పగించారు. ఇది ఇలా ఉండగా డైరెక్టర్ గా ఉన్న లోకాని గంగమ్మ అని ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో తన డైరెక్టర్ పదవికి రాజీనామా సమర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ గోపి మాట్లాడుతూ మరోసారి బాధితులు అప్పగించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మారుతి డైరెక్టర్ దాస్ నామాల గంగాధర్ అరటి బాలయ్య గంగారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లవీన్ గౌడ్ సీఈవో శ్రీకాంత్ సిబ్బంది రవి కిషన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోటలపల్లిలో ఉపాధి హామీ పనులపై ఆకస్మిక తనిఖీ
– గ్రామాభివృద్ధికి ఉపాధి పనులు దోహదపడాలి ఎంపీడీవో హెప్సీబా రాణి
– ఏపీవో అన్నపూర్ణ టీఏ సంతోష్ గ్రామ సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్
– కూలీలకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించాలి – పనుల్లో నాణ్యత, పారదర్శకత తప్పనిసరి
– మస్టర్ రోల్స్ సక్రమంగా నిర్వహించాలి – అధికారులకు పలు కీలక సూచనలు

కామారెడ్డి, రూరల్ మే 8 (ప్రజాజ్యోతి): కామారెడ్డి మండలం కోటలపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పనులను కామారెడ్డి ఎంపీడీవో హెప్సీబా రాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల స్థితిగతులను పరిశీలిస్తూ పనుల నాణ్యత, కూలీల హాజరు, మస్టర్ రోల్స్ నిర్వహణ, ప్రభుత్వ నిబంధనల అమలు, పని ప్రదేశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉదయం గ్రామానికి చేరుకున్న ఎంపీడీవో నేరుగా పని ప్రదేశాలకు వెళ్లి ఉపాధి కూలీలతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అన్న విషయాన్ని తెలుసుకున్నారు. వేతనాలు సమయానికి జమ అవుతున్నాయా, పనుల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా, తాగునీరు, విశ్రాంతి కోసం నీడ, ప్రథమ చికిత్స సదుపాయాలు ఉన్నాయా అనే అంశాలపై కూలీలతో నేరుగా మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో హెప్సీబా రాణి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఎంతో మేలు చేస్తోందన్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పిస్తూ వారి జీవనోపాధికి భరోసా ఇస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని అధికారులు సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులు కేవలం తాత్కాలిక ఉపాధికే పరిమితం కాకుండా గ్రామాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఉండాలని ఎంపీడీవో పేర్కొన్నారు. చెరువుల పునరుద్ధరణ, మట్టి పనులు, రహదారి మరమ్మతులు, కాలువల శుభ్రపరిచే పనులు, పల్లె ప్రకృతి వనాల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులు వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న ప్రతి పని ప్రజలకు దీర్ఘకాల ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని అన్నారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన ఎంపీడీవో, పనులు సక్రమంగా జరగకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మస్టర్ రోల్స్ నమోదు పారదర్శకంగా నిర్వహించాలని, కూలీలకు పని చేసిన రోజుల ప్రకారం సరైన వేతనాలు అందేలా చూడాలని సూచించారు. అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో సూచించారు. పని ప్రదేశాల్లో తాగునీటి సౌకర్యం, నీడ, ప్రథమ చికిత్స పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని తెలిపారు. కూలీలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని అన్నారు. గ్రామ ప్రజలు కూడా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించి గ్రామ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ఉపాధి పనుల ద్వారా గ్రామాల రూపురేఖలు మారాలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కూడా ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొన్ని సమస్యలను ఎంపీడీవో దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామంలోని పనులను మరింత వేగవంతం చేసి లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏపీవో అన్నపూర్ణ, టీఏ సంతోష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవలక్ష్మి, గ్రామ సర్పంచ్ ఆకుల శ్యాం కుమార్, ఉపసర్పంచ్ గోపాల్, వార్డు సభ్యులు బాలయ్య, గీత, లత, రమేష్, గంగయ్య, గ్రామ పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో కొనసాగుతున్న పనులపై ఎంపీడీవో సంతృప్తి వ్యక్తం చేస్తూ పనులను మరింత నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

క్యాసంపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనుల విస్తృత తనిఖీ
– గ్రామీణ పేదల ఆర్థిక బలోపేతానికి ఉపాధి హామీ పథకం దిక్సూచి
– కూలీలకు అవగాహన కల్పించిన సర్పంచ్ అడప శ్యామ్
– పనుల్లో నాణ్యత, క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన గ్రామాభివృద్ధి
– కూలీల సంక్షేమం రెండు లక్ష్యాల సాధనకే ఉపాధి హామీ పనులు: అధికారులు

కామారెడ్డి రూరల్, మే 8 (ప్రజాజ్యోతి): కామారెడ్డి మండలం క్యాసంపల్లి గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ అడప శ్యామ్ శుక్రవారం విస్తృతంగా పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి స్రవంతి, టి.ఏ సంతోష్‌తో కలిసి పని ప్రదేశాలను సందర్శించి పనుల పురోగతి, కూలీల హాజరు, మస్టర్ రోల్స్ నిర్వహణ, పనుల నాణ్యత, భద్రతా చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. గ్రామంలోని ఉపాధి హామీ పనులు గ్రామాభివృద్ధికి ఉపయోగపడేలా ఉండాలని, ప్రభుత్వం కేటాయిస్తున్న ప్రతి రూపాయి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఖర్చు కావాలని సర్పంచ్ అడప శ్యామ్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, వేతనాల చెల్లింపులు, పని పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ అడప శ్యామ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం గ్రామీణ పేద కుటుంబాలకు వరంగా మారిందన్నారు. వ్యవసాయ పనులు లేని కాలంలో ఈ పథకం వేలాది కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తోందన్నారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో వలసలు తగ్గుముఖం పట్టాయని తెలిపారు. పథకం ద్వారా గ్రామాల్లో చెరువుల పూడికతీత, మట్టి సంరక్షణ, కాలువల నిర్మాణం, పంట పొలాలకు మౌలిక సదుపాయాల కల్పన, పచ్చదనం పెంపు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కూలీలు పనులను క్రమశిక్షణతో నిర్వహించాలని, విధులకు సమయానికి హాజరుకావాలని సూచించారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రతి కూలీ పని ప్రదేశంలో భద్రతా చర్యలు పాటిస్తూ జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు. మహిళా కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొనడం సంతోషకరమని, మహిళల ఆర్థిక సాధికారతకు ఈ పథకం ఎంతో దోహదపడుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడానికి ప్రభుత్వం తీసుకొస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి స్రవంతి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీల హక్కులు పూర్తిస్థాయిలో పరిరక్షించబడుతున్నాయని తెలిపారు. ప్రతి కూలీ జాబ్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని, హాజరు నమోదు సక్రమంగా చేయించుకోవాలని సూచించారు. వేతనాలు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నందున ఎలాంటి అనుమానాలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. టి.ఏ సంతోష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కేవలం ఉపాధి కల్పించే కార్యక్రమం మాత్రమే కాకుండా గ్రామీణాభివృద్ధికి బలమైన పునాది అని తెలిపారు. చెరువుల పునరుద్ధరణ, భూసార పరిరక్షణ, వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెంపు వంటి పనుల ద్వారా వ్యవసాయ రంగానికి కూడా పరోక్షంగా మేలు జరుగుతోందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులు పారదర్శకంగా కొనసాగుతున్నాయని చెప్పారు. కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, సంక్షేమ ప్రయోజనాలపై అధికారులు ప్రత్యేక అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూలీల పిల్లల విద్య, కుటుంబ సంక్షేమం విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. పని ప్రదేశంలో కొంతమంది కూలీలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, గ్రామ ప్రజల సహకారంతో క్యాసంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని సర్పంచ్ అడప శ్యామ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు, గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వలన లాభాలు
– రుద్రూర్ శాస్త్రవేత్త షహనా బేగం

రామారెడ్డి మే 08(ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలోని అన్నారం రైతు వేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులకు వరిలో మెరుగైన రకాలు మరియు వరి కొయ్యలను కాల్చడం వలన జరిగే నష్టాలు, పంట మార్పిడి, పచ్చి రొట్టె ఎరువులు వాడకం, వ్యవసాయ యాంత్రికరణ, రసాయన ఎరువుల వలన కలిగే నష్టాలు, ప్రకృతి వ్యవసాయం వలన లాభాలు, నేల ఆరోగ్యాన్ని సంరక్షించే విధానం మరియు వరిలో సన్నగింజ రకాలు వాటి దిగుబడి చీడపీడల యజమాన్యం గురించి వివరించడం జరిగింది . ఈ కార్యక్రమంలో రుద్రూర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్త సహనా బేగం, వ్యవసాయ విస్తీర్ణ అధికారి సూర్య ప్రకాష్, అన్నారం, గొడుగుమర్రి తండా, మద్దికుంట, గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచ్లు, వార్డ్ మెంబర్స్, పిఏసిఎస్ చైర్మన్ మరియు ఆదర్శ రైతులు పాల్గొనడం జరిగింది.

పశుసంవర్తక చికిత్స అవగాహన సదస్సు
– డాక్టర్ రామ్ చందర్

రామారెడ్డి మే 08 (ప్రజా జ్యోతి) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రామారెడ్డి మండలంలోని పోసానిపేట గ్రామంలో పశుసంవర్ధక శాఖ మరియు తెలంగాణ పశు గణాభివృద్ధి సంస్థ ల సంయుక్త ఆధ్వర్యంలో పశు సంవర్ధక చికిత్స అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. మండల పశువైద్య అధికారి డా.రామ్ చందర్ మాట్లాడుతూ వేసవికాలంలో పశువులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు దూడల పోషణ గురించి అవగాహన కల్పించారు. పాడి రైతులకు సబ్సిడీమీద ప్రభుత్వం అందిస్తున గడ్డి విత్తనాలను తీసుకొని పచ్చిగడ్డి పెంచాలని కోరడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మరియు పాడి రైతులు పాల్గొనడం జరిగింది.

అటవీ-రెవెన్యూ సరిహద్దు వివాదంపై ఆర్‌డిఓ సమీక్ష

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) మే 08: వెల్దుర్తి మండలం తహసీల్దార్ కార్యాలయంలో తూప్రాన్ ఆర్‌డిఓ జయచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. మంగళిపర్తి మరియు హస్తాల్‌పూర్ గ్రామాల పరిధిలోని సర్వే నంబర్లు 401 మరియు 283 కు సంబంధించిన అటవీ మరియు రెవెన్యూ శాఖల సరిహద్దు వివాదంపై అధికారులు సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి భూసరిహద్దులపై ఉన్న వివాదాస్పద అంశాలను పరిశీలించి, సంబంధిత రికార్డులు, మ్యాపులు, ఫీల్డ్ స్థాయి వివరాలను ఆర్‌డిఓ సమీక్షించారు. సమస్యను చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామాల పరిధిలో భూసరిహద్దుల స్పష్టత కోసం సంయుక్త సర్వే నిర్వహించి, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూట్ క్లియర్.. రైట్ రైట్..

– 'ప్రజాజ్యోతి' కథనానికి స్పందన – తొలగిన పార్కింగ్ అడ్డంకులు..!

ప్రజాజ్యోతి
08 May 2026 - Page 8
మలుపులో డ్రైవర్‌కు తప్పని తిప్పలు

నర్సాపూర్ (ప్రజాజ్యోతి) మసీదు మలుపు వద్ద వాహనాల అడ్డగోలు పార్కింగ్‌తో ఆర్టీసీ బస్సులు పడుతున్న ఇబ్బందులపై 'ప్రజాజ్యోతి'లో ప్రచురితమైన 'మలుపులో డ్రైవర్‌కు తప్పని తిప్పలు' కథనానికి శుక్రవారం స్పందన లభించింది. మలుపు వద్ద ఇష్టారాజ్యంగా నిలిపిన వాహనాలను తొలగించి, బస్సులు తిరగడానికి వీలుగా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించారు. ఎప్పుడూ ట్రాఫిక్ గందరగోళంతో ఉండే ఆ ప్రాంతం ఒక్కసారిగా తేలికపడింది. బస్సులు ఇప్పుడు ఎలాంటి ఆటంకం లేకుండా 'రైట్ రైట్' అంటూ సాగిపోతున్నాయి. సమస్యపై పరిష్కారం చూపిన 'ప్రజాజ్యోతి'కి డ్రైవర్లు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చలాన్లు తప్పవని అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

కాంటా, రవాణా వేగవంతం చేయాలి

– ధాన్యం కొనుగోలుపై అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం

– ఇప్పటివరకు రూ. 52 కోట్ల చెల్లింపులు పూర్తి

కౌడిపల్లి ప్రజా జ్యోతి మే 08 అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం మహ్మద్ నగర్ గ్రామంలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి, లోడింగ్, అన్ లోడింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 14 వేల మంది రైతుల నుంచి 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, వారి ఖాతాల్లో రూ. 52 కోట్లు జమ చేశామని వివరించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. వర్షాల ముప్పు ఉన్నందున కేంద్రాల్లో తగినన్ని టార్పాలిన్లు, లారీలు, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. మిల్లుల వద్ద అన్ లోడింగ్ సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేంద్ర నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

మేలైన రకాలతోనే అధిక దిగుబడి

– శాస్త్రవేత్త ఏవీ రామాంజనేయులు

కౌడిపల్లి ప్రజా జ్యోతి మే 08 రైతులు వ్యవసాయ విశ్వవిద్యాలయం సిఫార్సు చేసిన వరి రకాలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఏవీ రామాంజనేయులు సూచించారు. మండలంలోని కంచన్‌పల్లిలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆరుతడి పంటల్లో బిందు, తుంపర సేద్యం పద్ధతులు పాటించి నీటిని ఆదా చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి జే.స్వప్న మాట్లాడుతూ ఎరువుల సమతుల్యతపై, శాస్త్రవేత్త ప్రేమ్ పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐకార్–నార్మ్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఉమేష్, డాక్టర్ పి.డి. శ్రీకాంత్, డాక్టర్ సుమంత్ కుమార్, సర్పంచ్ సత్యంగౌడ్ మరియు రైతులు పాల్గొన్నారు.

వెలికట్ట చౌరస్తాలో

బస్సు షెల్టర్ లేక ప్రయాణికుల అవస్థలు

– ఎండలోనే నిరీక్షణ – తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

కొండపాక మే 8(ప్రజా జ్యోతి):– సిద్దిపేట నుండి జనగామ వెళుతున్న జహతీయ రహదారి వెలికట్ట చౌరస్తాలో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మరమ్మతుల పనుల సమయంలో అక్కడ ఉన్న పాత బస్సు షెల్టర్‌ను తొలగించడంతో ఇప్పటివరకు కొత్త షెల్టర్ ఏర్పాటు చేయలేదు. దీంతో నిత్యం ప్రయాణించే ప్రజలు ఎండలోనే నిలబడి బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ హైదరాబాద్ నుండి వచ్చే ప్రయాణికులతో పాటు చేర్యాల పరిసర గ్రామాలకు వెళ్లే వందలాది మంది ఈ చౌరస్తాను వినియోగిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు మండుతున్న ఎండలో నిలబడటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీడ లేకపోవడంతో, రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. వర్షాకాలంలో వాన నుంచి రక్షణ లేక, వేసవిలో ఎండ తాకిడితో ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితిలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి వెలికట్ట చౌరస్తాలో జనగామ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం శాశ్వత బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని స్థానికులు ప్రయాణికులు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతు ఇబ్బందులపై ఆర్‌డిఓ ఆరా

– రైతు ధాన్యం వెంటనే అన్‌లోడ్ చేయాలి: మిల్లర్‌కు స్పష్టమైన ఆదేశాలు

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) మే 08: వెల్దుర్తి మండలంలోని హస్తాల్పూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తూప్రాన్ ఆర్‌డిఓ జయ చంద్రారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం నిల్వలు, తూకం ప్రక్రియ, అన్‌లోడింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. అనంతరం వెల్దుర్తి గ్రామంలో ఉన్న మహా గణపతి రైస్ మిల్లు ను సందర్శించి ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను సమీక్షించారు. ఈ సందర్భంగా మిల్లర్‌కు ఆర్‌డిఓ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు రోజులు తరబడి లారీల వద్ద వేచి ఉండే పరిస్థితి రాకుండా ధాన్యాన్ని త్వరితగతిన అన్‌లోడ్ చేయాలని సూచించారు. అన్‌లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా జరిగేందుకు అవసరమైన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో కూడా పనులు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ, తూకం సదుపాయాలు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ధాన్యం తరలింపులో ఆలస్యం జరిగితే రైతులు నష్టపోతారని, అందువల్ల ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని హెచ్చరించారు. ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల లక్ష్యం రైతుకు మేలు చేయడమేనని, రైతుల శ్రమ వృథా కాకుండా అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని ఆర్‌డిఓ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన తూప్రాన్ మార్కెట్ కమిటీ పాలకవర్గం

– మార్కెట్ కమిటీకి వేం నరేందర్ రెడ్డి కీలక సూచనలు

తూప్రాన్ (ప్రజాజ్యోతి) మే 08: మెదక్ జిల్లా తూప్రాన్ నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన యంజాల కీర్తన విఠల్ రెడ్డి ఆధ్వర్యంలోని పాలకవర్గం శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. రైతులు ఆర్థికంగా మరింత బలపడేలా మద్దతు ధర కల్పనకు కృషి చేయాలని, రైతు ప్రయోజనాల పరిరక్షణలో మార్కెట్ కమిటీ కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. రైతు ప్రభుత్వం అనే పేరుకు తగ్గట్టుగానే కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని, రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా చర్యలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మాదంశెట్టి వెంకటేశం, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, సింగిడి మహిపాల్ రెడ్డి, ఉట్ల సత్యనారాయణ, లక్ష్మణ్, దాసరి నాగరాణి శ్రీకాంత్, సంద వెంకటేష్, సర్పంచ్‌లు సత్యనారాయణ, కృష్ణ, వెంకటేష్, భాగ్యలక్ష్మి యాదగిరి, మనోహరాబాద్ మండల్ యూత్ కాంగ్రెస్ లీడర్ నవీన్, సీనియర్ నాయకులు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ కమ్మరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి మార్కెట్‌లో రైతుల ఆగ్రహం

– కొనుగోళ్లు ప్రారంభించకపోతే వంటా–వార్పు

– రైతులను పోలీసులు బెదిరిస్తే సహించేది లేదు – బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి

మిరుదొడ్డి, మే 8, (ప్రజా జ్యోతి): మిరుదొడ్డి వ్యవసాయ మార్కెట్‌లో రైతుల సమస్యలు రోజురోజుకూ తీవ్రరూపం దాలుస్తున్నాయి. గత నెల రోజులుగా మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం సూచించిన మేరకు వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసిన రైతులకు ఇప్పుడు ధాన్యం అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి శుక్రవారం మార్కెట్ యార్డును సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు కూడా లేవని ఆయన మండిపడ్డారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని కప్పుకునేందుకు పాలిథిన్ కవర్లు కూడా అందించడం లేదని, ఎండలు, వర్షాల మధ్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం మాటలు నమ్మి పంట మార్పిడి చేసి మొక్కజొన్న, పొద్దుతిరుగుడు సాగు చేసిన రైతులకు ఇప్పుడు గోస మాత్రమే మిగిలిందని తోట కమలాకర్ రెడ్డి విమర్శించారు. వెంటనే లారీలను ఏర్పాటు చేసి మార్కెట్ యార్డులో ఉన్న మొక్కజొన్న, పొద్దుతిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే వచ్చే సోమవారం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో కలిసి వంటా–వార్పు కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. రైతుల ధర్నాలు, ఆందోళనలను అణచివేయడానికి అధికారులు లేదా పోలీసు యంత్రాంగం ప్రయత్నిస్తే సహించబోమని స్పష్టం చేశారు. రైతు కష్టాన్ని పట్టించుకోని ఈ ప్రభుత్వానికి అన్నదాతల ఆవేదన తప్పదని, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను పూర్తిగా గాలికొదిలేసిందని తోట కమలాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన వెంట బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తోట అంజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సత్తు బాల్ రెడ్డి, దార స్వామి, దార మల్లయ్య, తిరుపతి, స్వామి తోపాటు రైతులు తదితరులున్నారు.

రక్తదానం చేయండి

– తలసేమియా వ్యాధిగ్రస్తులను కాపాడండి – మిత్ర బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో 2కె రన్

సిద్దిపేటఅర్బన్, మే8 (ప్రజాజ్యోతి):– ప్రతి ఒక్కరు రక్త దానం చేసి తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవాలని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మిత్ర బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు వేణు గోపాల్ చారి లు అన్నారు.ఆరోగ్య వంతులు ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని శుక్రవారం మిత్ర బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సిద్ధిపేట లోని పాత బస్టాండ్ నుండి డిగ్రీ కళాశాల గ్రౌండ్ వరకు టు కే రన్ నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యుపరమైన వ్యాధిగా వస్తూ ఉంటుందని దీనికి అనేక రకాలు కారణాలు ఉంటాయన్నారు. ప్రధానంగా మేనరికం పెళ్లిళ్లు జన్యుపరమైన సమస్యలు ఉన్నవారితో పెళ్లిళ్లు తగ్గించేలా చూస్తే ఇటువంటి సమస్యలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందన్నారు. ఇటువంటి వ్యాధి సోకిన వారికి జీవితాంతం రక్తం ఎక్కిస్తూనే ఉండాలని ప్రతి 20 రోజులకు ఒకసారి లేదా నెల రోజులకు ఒకసారి రక్తం ఎక్కిస్తేనే వారు బతికే అవకాశం ఉంటుందని అన్నారు. కాబట్టి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్లు సాయిరాం భాస్కర్, గణేష్, , భీమేష్, రమేష్, నాగస్పందన, శ్రీపతి, విష్ణువర్ధన్, రన్నర్ అసోసియేషన్ అధ్యక్షులు రాజు, హాస్పిటల్ మేనేజ్మెంట్ నిర్వాహకులు ఇమ్రాన్, నాగరాజు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, మిత్రబ్యాంక్ సిబ్బంది, వ్యాధిగ్రస్తుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కొండపాక పిఎసిఎస్ చైర్మన్‌గా

బాధ్యతలు తీసుకున్న చిట్టి దేవేందర్ రెడ్డి

కొండపాక మే 8 (ప్రజా జ్యోతి):–కొండపాక పిఎసిఎస్ చైర్మన్ గా చిట్టి దేవేందర్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఫిబ్రవరి 14 2025 నాటికి ఉన్న కమిటీని కొనసాగిస్తూ డి సి ఓ జారీ చేసిన ఉత్తర్వులను అనుసరించి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అలాగే దేవేందర్ రెడ్డి తో పాటు పాలకవర్గంలోని వైస్ చైర్మన్, డైరెక్టర్లు బాధ్యతలు తీసుకున్నారు.

ఘనంగా కర్రోల్ల సురేందర్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్
- శాలువాతో సన్మానించిన శుభాకాంక్షలు తెలియజేసిన సుదర్శన్ గౌడ్,ఇందూరి శ్రీనివాస్

కొత్తూర్ మే 07 (ప్రజా జ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మాజీ షాద్ నగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోళ్ల సురేందర్ జన్మదిన సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్,ఇందూరి శ్రీనివాస్ హాజరై పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ..మున్సిపాలిటీ అభివృద్ధిలో మరియు పార్టీ బలోపేతంలో సురేందర్ పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు.నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొనే సురేందర్ కు యువతలో మంచి ఆదరణ ఉందన్నారు.భవిష్యత్తు లో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాక్షించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలకమర్రి నరసింహ,మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజేశ్వర్,బంటి,నరసింహ గౌడ్, సుమన్,హాసన్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీగణేష్

బోయిన్ పల్లి, మే 8 (ప్రజాజ్యోతి) : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ.. మంత్రి పొన్నం ప్రభాకర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నట్లు తెలిపారు.

ఎంబి పాలి క్లినిక్ డయాగ్నెట్ సెంటర్ ఘనంగా ప్రారంభోత్సవం

రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ (ప్రజాజ్యోతి) ప్రతినిధి : చంపాపేట్ డివిజన్ పరిధిలో దుర్గానగర్ కాలనీలో ఎంబి పాలి క్లినిక్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మన్ మద్ది కరుణాకర్ రెడ్డి, మాధవ నగర్ కాలనీ అధ్యక్షుడు గోపాల్ ముదిరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నిర్వాహకుడు డాక్టర్ భాను చందర్ మాట్లాడుతూ ఆధునిక వైద్య సదుపాయాలు, ల్యాబ్ టెస్టులు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఫిజియోథెరపీ, ఈసీజీ వంటి సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అతిథులు సూచించారు. ఈ కార్యక్రమంలో చంపాపేట్ డివిజన్ బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు చీర శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు ఎంమా భాష బాలమురళి బాల ఉదయ్ భక్తుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ సరఫరా కీలక నిందితుడి అరెస్టు

- పలు కేసుల్లో తప్పించుక తిరుగుతున్న క్రిమినల్‌తో పాటు మరో ముగ్గురి అరెస్టు
- 4.62 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్ స్వాధీనం.. కారుతోపాటు సెల్‌ఫోన్ల సీజ్

శేరిలింగంపల్లి, మే 08 (ప్రజాజ్యోతి) : డ్రగ్స్ అలవాటు పడి కారునడుపుతు రోడ్డు ప్రమాదంలో కుడి చేయి పోగొట్టుకున్నాడు.ఐనా తనలో మార్పురాని షెక్ ఫైసల్ డ్రగ్స్ అమ్మకాల్లో నోటేరియస్ క్రిమినల్ చెలామణి అవుతున్నాడు. ఇప్పటికే మూడు కేసుల్లో తప్పించుక తిరుగుతున్నాడు.శుక్రవారం తెల్లవారు జామున ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బీమ్ ఎస్సై సంధ్యా సిబ్బందికి ఎండిఎంఎ డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ ప్రధాన నిందితుడు షేక్ ఫైసల్ మరో ముగ్గురు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే...ట్రబ్‌నగర్ అంబర్‌పేట్ ప్రాంతంలో డ్రగ్స్ అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బీ టీమ్ ఎస్సై సంధ్యా సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు. కారులో అనుమానితులుగా ఉన్న నలుగురిని తనిఖీలు చేశారు.వారివద్ద ఉన్నా 4.62 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసు కున్నారు. డ్రగ్స్‌తో పాటు కారును మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు.ఈ నలుగురు నిందిగతుల్లో షేక్ ఫైసల్, పి.అన్ను ప్రసాద్, ఎండి. మసూద్,ఏ.ప్రీతి వర్ధన్‌లను అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితులు బెంగూళూరు నుంచి 20 గ్రాముల ఎండీఎంఎ తీసుక వచ్చి అమ్మకాలు జరుపు తుండగా ఎస్టీఎఫ్ టీమ్ పట్టుకున్నారు. ఈ విచారణలో షేక్ ఫైసల్ అనే వ్యక్తి చాల కాలంగా డ్రగ్స్‌ను సేవించడంతో పాటు పెద్ద మొత్తంలో అమ్మకాలు చేపడుతున్నట్లు, ఇప్పటికే పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. నిందితులను, డ్రగ్స్‌ను, కారును,సెల్ ఫోన్లను కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ, టీమ్ లీడర్ బిక్షారెడ్డి, ప్రదీప్‌రావులు తెలిపారు.

దివంగత ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డికి ఘనంగా నివాళులర్పించిన చిల్కానగర్/బీరప్ప గడ్డ నాయకులు

జోహార్ రాజన్న,జోహార్ జోహార్ రాష్ట్ర నాయకులు బన్నాల

ఉప్పల్, మే 8, ప్రజా జ్యోతి : బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గ తొలి ఎమ్మెల్యే దివంగత బండారి రాజిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ దివంగత ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకొని పీడిత ప్రజల పక్షాన ఎల్లప్పుడూ నిలుస్తూ వారికి అందుబాటులో ఉంటూ నిజమైన ప్రజా నాయకుడిగా నిలిచారు, పాలకుడిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అంకిత భావంతో సేవలందించిన ఆ మహానేతకు పార్టీలకతీతంగా ప్రథమ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గం లోని నాయకులు నివాళులర్పిస్తా ఉన్నారని కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి ,కొక్కొండ జగన్, మాస శేఖర్, అశోక్ చారి, బాలకృష్ణ గౌడ్, సదానంద చారి, యాదగిరి, పోచయ్య, రమేష్,మార్కా శీను ఆజాద్ శ్యామ్ రజక,బంటి గౌడ్, బీరప్ప గడ్డ బాలు, నరసింహ చారి మొదలగువారు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో ప్రభుత్వ బాలికల పాఠశాల ఆధునీకరణకు శ్రీకారం

ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవతో రూ.1 కోటి పైగా సిఎస్ఆర్ నిధులు

బోయిన్ పల్లి, మే 8 (ప్రజాజ్యోతి) : కంటోన్మెంట్ నియోజకవర్గంలో నవ కంటోన్మెంట్ నిర్మాణ లక్ష్యంతో ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి చర్యలు వేగవంతమవుతున్నాయి.ఇందులో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చొరవతో మోండా డివిజన్ పరిధిలోని రెజిమెంటల్ బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి.ఇటీవల ఎమ్మెల్యే పాఠశాలను సందర్శించిన సందర్భంగా అక్కడ సరిపడా తరగతి గదులు లేకపోవడం, మౌలిక వసతుల కొరత ఉన్నట్లు గుర్తించారు. దీంతో మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడి, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) నిధుల కింద రూ.1 కోటి పైగా వ్యయంతో పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చేలా ఒప్పించారు. ప్రభుత్వ అనుమతుల ప్రక్రియ పూర్తి చేయించిన అనంతరం శుక్రవారం ఎమ్మెల్యే శ్రీగణేష్ మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ ట్రస్ట్ ప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలపై వివరాలు తెలుసుకుని, వాటికి అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు తోడు కార్పొరేట్ సంస్థలు కూడా తమ సామాజిక బాధ్యతగా విద్యా రంగానికి సహకరించాలని అన్నారు. అందరి సహకారంతోనే "నవ కంటోన్మెంట్" నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారీ స్థాయిలో నిధులు వెచ్చించి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ముందుకు వచ్చిన మహావీర్ ఇంటర్నేషనల్ ఉడాన్ ట్రస్ట్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

వెంకటేశ్వర స్వామి మాస కళ్యాణం వైభవంగా నిర్వహణ

- భక్తులతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం
- అన్నదాన మహా ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

బోయిన్‌పల్లి, మే 8 (ప్రజా జ్యోతి) : బోయిన్‌పల్లి న్యూ సిటీ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో ప్రతి నెల శ్రవణ నక్షత్రం సందర్భంగా నిర్వహించే శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి మాస కళ్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను తులసి దళాలు, పసుపు, కుంకుమ, గంధం, పూలు, వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అక్షతలు చల్లుతూ భక్తిశ్రద్ధలతో కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. "ఓం నమో వెంకటేశాయ", "ఓం నమో నారాయణాయ", "జై శ్రీమన్ నారాయణ" నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతల సహకారంతో అన్నదాన మహా ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సుమంత్ రెడ్డి, జగన్నాథం, రాంమోహన్ రావు, సాంబశివరావు, నాగేశ్వరరావు, ఆలయ అర్చకులు పవన్, శ్రీధర్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారి ఐపీఎల్ ఛాంపియన్‌గా ఎస్ఆర్‌హెచ్ నిలుస్తుంది : అనికేత్ వర్మ

తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న సన్‌రైజర్స్ ఆటగాడు

బోయిన్ పల్లి, మే 8 (ప్రజాజ్యోతి) : ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఈసారి తప్పకుండా ఛాంపియన్‌గా నిలుస్తుందని జట్టు ఆటగాడు అనికేత్ ఉమాశంకర్ వర్మ ధీమా వ్యక్తం చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రస్తుతం అద్భుత ప్రదర్శనతో టాప్‌లో కొనసాగుతోందని, జట్టులో మంచి సమన్వయం ఉండటంతో ఈ సీజన్‌లో టైటిల్ గెలిచే అవకాశాలు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు.భారతదేశానికి చెందిన యువ క్రికెటర్ అనికేత్ ఉమాశంకర్ వర్మ దేశవాళీ క్రికెట్‌లో మధ్యప్రదేశ్ తరపున, ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తరపున ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ప్రాక్టీస్ ముగించుకున్న అనంతరం తాడ్‌బండ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ అనికేత్ వర్మతో ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వదించారు. అనంతరం ఆలయ కండువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఆలయానికి వచ్చిన అనికేత్ వర్మను చూసేందుకు అభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు యువత ఆసక్తి చూపగా, అందరితో సరదాగా మాట్లాడుతూ అభిమానులను ఆకట్టుకున్నారు. ఆలయ సిబ్బందిని పలకరిస్తూ ఆప్యాయంగా మెలగడంతో ఆలయ పరిసరాల్లో సందడి వాతావరణం నెలకొంది.

తెలంగాణ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పు...

- తెలంగాణలో విద్యావిప్లవానికి ఆరుట్లలో శ్రీకారం .....
- అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ....
- వచ్చే నెల 15న సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు....
- రాష్ట్రవ్యాప్తంగా ఇదే తరహాలో విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి....
- ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించిన రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు...
- అధునాతన హంగుల ప్రభుత్వ బడిని చూసి హర్షం...
- విప్‌లను సన్మానించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి...

ఇబ్రహీంపట్నం 08 మే ప్రజాజ్యోతి : రాష్ట్ర ప్రభుత్వం ఫైలెట్ ప్రాజెక్టు కింద ఆరుట్లలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేవలం ఒక బడి మాత్రమే కాదు.... తెలంగాణ విద్యా వ్యవస్థలో రాబోయే విప్లవాత్మక మార్పులకు ఒక ప్రయోగశాలగా ప్రభుత్వ విప్ లు అభివర్ణించారు. ఇక్కడి ప్రతీ సౌకర్యం ఇంటర్నేషనల్ స్కూల్ కు ధీటుగా ఉండటం విద్యావ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనంగా పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణ రావు, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వేముల వీరేశం, బీర్ల అయిలయ్య, రామచందర్ నాయక్ , అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ సందర్శించారు. శుక్రవారం ఉదయం ఆరుట్ల గ్రామానికి చేరుకున్న వీరికి స్వాగతం పలికిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణం, సౌకర్యాలు, పనితీరు గురించి రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి వారికి వివరించారు. ఇంటిగ్రేటెడ్ విద్యా వ్యవస్థ, అధునాతన తరగతి గదులు, ఉచిత బస్సు సౌకర్యం, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడామైదానం, జిమ్, భోజన సౌకర్యాలు, ఇతర మౌలిక వసతులను ఆకునూరి మురళి, ఎమ్మెల్యే మల్ రెడ్డి వివరించారు. కార్పొరేట్ విద్యాసంస్థల్ని తలదన్నేలా ప్రభుత్వం నిర్మిస్తున్న పాఠశాలను చూసి ప్రభుత్వ విప్ లు హర్షం వ్యక్తం చేశారు. ఇదే తీరుగా రాష్ట్రంలో 100 చోట్ల తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల నిర్మాణానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకోసం ఆరుట్ల పాఠశాలను నమూనాగా తీసుకోనున్నట్లు తెలిపారు. భావిభారతం అభివృద్ధిపథంలో సాగాలంటే విద్య అతిముఖ్యమని... అందుకోసమే విద్యావ్యవస్థను బాగుచేసి, దేశభవిష్యత్తుకు ప్రభుత్వం బంగారుబాటలు వేస్తుందని చెప్పారు.

ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా భావిస్తున్నాః ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి... : రాష్ట్ర విద్యావిప్లవానికి తమ నియోజకవర్గం నుంచి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం ఇబ్రహీంపట్నం ప్రజల అదృష్టంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి మార్గదర్శకంగా అత్యున్నత ప్రమాణాలతో ఈ పబ్లిక్ స్కూల్ పూర్తైందని చెప్పారు. విద్యావైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని.... ఈ సారి బడ్జెట్ లో రూ.26వేల కోట్లకు పైగా విద్యకు కేటాయింపులు చేయటమే ఇందుకు నిదర్శనమన్నారు. పేదలందరికీ ఉచితంగా ఉన్నత ప్రమాణాలతో విద్యనందించిన నైపుణ్యం గల యువతను దేశానికి అందించటమే లక్ష్యంగా పనిచేస్తోందని... ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు పాండురంగారెడ్డి, హనుమంత్ రెడ్డి, రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, భూపతిగల్ల మహిపాల్, స్థానిక సర్పంచ్ మానుపాటి శోభాకుమార్ హెచ్ఎం గిరిధర్ గౌడ్ నాయకులు సాతిరి ఎల్లేష్, గుడిమల్ల చంద్రయ్య, మాసయ్య, గౌడ్ మార సురేష్, ఏ భరత్ రెడ్డి, కావలి శ్రీనివాస్, బైరీక రమాకాంత్ రెడ్డి, చీమల జంగయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు పలువురు నాయకులు కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత జక్కుల మహేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా సిఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పంపిణీ

మాజీ మంత్రి మల్లారెడ్డి సహకారంతో లబ్ధిదారుడికి చికిత్స నిధులు

బోయిన్ పల్లి, మే 8 (ప్రజా జ్యోతి) : జెఎంఆర్ శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ వార్డ్ నంబర్ 1 మైనారిటీ అధ్యక్షుడు అసిన్ ఖాన్‌తో కలిసి సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఎల్‌వోసీ లేఖను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు.న్యూ బోయిన్‌పల్లి పెన్షన్ లేన్‌కు చెందిన అబ్దుల్ కరీం కుమారుడు అబ్దుల్ లతీఫ్ జాహిద్ తండ్రి వైద్య చికిత్స నిమిత్తం రూ.1,50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైనట్లు తెలిపారు. ఈ ఎల్‌వోసీ లేఖను కుటుంబ సభ్యుడు అబ్దుల్ ఉమర్‌కు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సహకారంతో బాధిత కుటుంబానికి సకాలంలో సహాయం అందినందుకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌లో ప్రధాని పర్యటన

- భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

శేరిలింగంపల్లి,మే 08 (ప్రజాజ్యోతి) : భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం (మే 10)న హైదరాబాద్‌కు రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు పై సీఎస్ రామకృష్ణారావు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ పర్యటన సందర్భంగా హైదరాబాద్ లోని ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణలు,ఆంక్షలు అమలు చేయడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. పోలీస్, ట్రాఫిక్, ఇంటెలిజెన్స్, జీహెచ్ఎంసీ తో పాటు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. ప్రధాని భద్రతకు సంబంధించిన బ్లూ బుక్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని, పర్యటన వివరాలను గోప్యంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. హెచ్ఐసీసీలో జరగనున్న సమావేశ హాలును అధికారులు సందర్శించారు.ఈ సమీక్ష సమావేశంలో డీజీపీ లా అండ్ ఆర్డర్ మహేష్ భగవత్,సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్, రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి,సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన,తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

తెలిపిన మిరియాల ప్రీతమ్

శేరిలింగంపల్లి, మే 08 (ప్రజాజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర రవాణా డ బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ జన్మదిన సందర్భంగా మంత్రి క్వార్టర్స్‌లో మిరియాల రాఘవ రావు, మిరియాల ప్రీతమ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో, మరెన్నో విజయాలతో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే రాష్ట్ర అభివృద్ధికి,బీసీ సంక్షేమానికి ఆయన మరింత సేవలందించాలని కోరుకున్నారు.

ఓల్డ్ బోయిన్ పల్లిలో పగలు వెలిగే వీధి దీపాలు

- రాత్రిళ్లు చీకట్లు.. ప్రజల్లో ఆందోళన

బోయిన్ పల్లి, మే 8.(ప్రజా జ్యోతి): ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ పరిధిలో వీధి దీపాల నిర్వహణపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఓల్డ్ బోయిన్ పల్లి, హస్మత్పేట్, అంజయ్య నగర్ తదితర కాలనీల్లో పగలు కూడా వీధి దీపాలు వెలిగిపోతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయంలో లైట్లు పనిచేయడం లేదని వాపోతున్నారు.పగటి వేళల్లో అవసరం లేకపోయినా వీధి దీపాలు వెలగడం వల్ల విద్యుత్ వృథా అవుతోందని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మరోవైపు రాత్రి సమయాల్లో కొన్ని వీధులు చీకట్లో మగ్గిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, ఉద్యోగస్తులు రాత్రి వేళల్లో భయాం దోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, జిహెచ్ఎంసి సిబ్బంది వెంటనే స్పందించి వీధి దీపాల నిర్వహణను సక్రమంగా చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రాష్ట్రంలోనే కరీంనగర్ మార్కెట్ గా ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

రైతులకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటాం: రైతు సంక్షేమమే ప్రధాన లక్ష్యం.. కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య

కరీంనగర్ బ్యూరో, మే 8(ప్రజాజ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో కరీంనగర్ మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రైతు సంక్షేమంలో దిక్సూచిగా నిలిచేలా కృషి చేస్తామని కరీంనగర్ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ ఆకుల నరసయ్య పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పాలకవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. చైర్మన్ తో పాటు పాలకవర్గ సభ్యులను రాజేందర్రావు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ కరీంనగర్ మార్కెట్ యార్డ్ పరిధిలో రైతులకు ఏ ఇబ్బంది వచ్చినా అండగా ఉంటామని తెలిపారు. ధాన్యం కొనుగోలు తోపాటు మద్దతుగా కల్పించే విషయంలో రైతులకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తామని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యవహరిస్తున్న నేపథ్యంలో రైతుల సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా 1991 వ సంవత్సరంలో కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్గా పనిచేసిన వెలిచాల రాజేందర్ రావు సూచనలు సలహాలు తీసుకుంటూ ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. గొప్ప మార్కెట్ గా తీర్చిదిద్దేందుకు తనతోపాటు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. తనతో పాటు డైరెక్టర్లంతా వ్యవసాయంపై చక్కని అవగాహన ఉందని రైతుల కష్టసుఖాలు అందరికీ తెలుసు అని తెలిపారు. రైతులకు సేవ చేసే గొప్ప బాధ్యతను ప్రభుత్వం అప్పగించిందని ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతుల సేవకే అంకితమై పని చేస్తామని పేర్కొన్నారు. ఒకవైపు రైతులకు అన్ని విధాలా అండగా ఉంటూనే రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని ఆకుల నరసన్న తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమించిన సీఎం రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు విప్ లు ఎమ్మెల్యేలతో పాటు కరీంనగర్ కాంగ్రెస్ నేతలు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చైర్మన్ తో పాటు

మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులను వెలిచాల రాజేందర్ రావు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఆకుల నర్మదా, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన సందర్భంగా అన్నదానం..

రాష్ట్ర రవాణా బిజీ సంక్షేమ శాఖ మంత్రి మంత్రి పొన్న ప్రభాకర్ జన్మదిన సందర్భంగా కట్టరాంపూర్ హనుమాన్ టెంపుల్ లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య కార్పొరేటర్ ఆకుల నర్మదా ఆధ్వర్యంలో హనుమన్ స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ స్వాములు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఆకుల నరసయ్య నర్మద హనుమాన్ భక్తులకు స్వయంగా వడ్డించారు. అదేవిధంగా హుస్నాబాద్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమించిన సందర్భంగా ఆకుల నరసయ్య మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు.

డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసిన ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం

కరీంనగర్ కలెక్టరేట్,మే 8:(ప్రజాజ్యోతి):
తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్‌ను చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్

అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం గురువారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.భేటీ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే డీజీపీతో చర్చించారు. ఇటీవల కరీంనగర్‌లో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలర్స్ ఘటనపై ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను త్వరితగతిన అరెస్టు చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను డాక్టర్ మేడిపల్లి సత్యం అభినందించారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీజీపీ సీవీ ఆనంద్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజలో పాల్గొన్న మద్దుల గోపాల్ రెడ్డి

ఎండపల్లి, మే 8 ప్రజా జ్యోతి:
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మంజూరైన మండలంలోని గొడిసెలపేట గ్రామంలో లబ్ధిదారులు ఓరగంటి సతీష్ దంపతులతో కలిసి నూతన ఇందిరమ్మ గృహ నిర్మాణ పనులకు మాజీ సింగిల్ విండో చైర్మన్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు, అనంతరం లబ్ధిదారులతో వారు మాట్లాడుతూ, సకాలంలో ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేసుకుని ప్రభుత్వం అందిస్తున్న ఐదు లక్షల ఆర్థిక సాయం పొందాలని, కోరారు,ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో చైర్మన్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దులగోపాల్ రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్, స్థానిక సర్పంచ్,,పంచాయతీ పాలకవర్గ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,అభిమానులు గ్రామస్తులు,పాల్గొన్నారు.

తుంగూర్‌లో ఘనంగా 'పశువైద్య ఆరోగ్య పశు సంతానోత్పత్తి మెగా శిబిరం

బీర్ పూర్, మే8, ప్రజా జ్యోతి:
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం తుంగూర్ గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పశువైద్య ఆరోగ్య మరియు పశు సంపద సంతానోత్పత్తి మెగా శిబిరం' విజయ

వంతమైంది. మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు మరియు తుంగూరు గ్రామ సర్పంచ్ అర్షకోట రాజగోపాల్ రావు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువుల ఆరోగ్యంపై రైతులు శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇలాంటి ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో మొత్తం 102 పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, చికిత్సలను అందించారు. బీర్ పూర్ మండల వెటర్నరీ డాక్టర్ జనుగామ సునీల్ నేతృత్వంలో పశువులకు కృత్రిమ గర్భధారణ, సంతానోత్పత్తి చికిత్సలు మరియు గర్భధారణ పరీక్షలు చేశారు. ఆధునిక పాడి యాజమాన్య పద్ధతులు, సెక్స్ సార్టెడ్ సెమెన్ వినియోగంపై అవగాహన కల్పించారు. రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రంగసాగర్ సర్పంచ్ బోడ సాగర్, తుంగూరు ఉప సర్పంచ్ లింగన్న, లైవ్ స్టాక్ అసిస్టెంట్ గణేష్, సహాయక సిబ్బంది సతీష్, అరుణ్, సాయి, ప్రవీణ్ మరియు రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు. శిబిరాన్ని విజయవంతం చేసినందుకు పశుసంవర్ధక శాఖ అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

అకాల వర్షం.. అన్నదాతకు తీరని నష్టం

బీర్ పూర్ మండలంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం!

బీర్ పూర్, మే8, ప్రజా జ్యోతి:
ఆకాశం కన్నెర్ర చేయడంతో అకాల వర్షం అన్నదాతల ఆశలను

నీరుగార్చింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట, చేతికొచ్చే సమయంలో వర్షం పాలు కావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. బీర్ పూర్ మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో గత 20 రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. గన్నీ బ్యాగుల కొరత, లేబర్ ఇబ్బందులు, ఆన్‌లైన్ ప్రక్రియలో జాప్యం వంటి కారణాలతో అధికారులు సేకరణను నత్తనడకన సాగిస్తున్నారు. ఈ జాప్యం వల్లే కల్లాల్లో ఆరబోసిన వడ్లు, మక్కలు తాజా వర్షానికి తడిసి ముద్దయ్యాయి. పంట పండించడం ఒక ఎత్తు అయితే, దానిని అమ్ముకోవడం రైతుకు మరో ఎత్తుగా మారింది. ప్రభుత్వాలు మారినా రైతు బతుకు చిత్రం మారడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి

పగలు కల్లాల్లోనే కాపలా ఉంటూ, వర్షం నుండి పంటను కాపాడుకోలేక రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు.తడిసిన ప్రతి గింజను ప్రభుత్వం నిబంధనలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలి.తేమ, తరుగు పేరుతో రైస్ మిల్లర్లు చేస్తున్న దోపిడీని అరికట్టాలి.ధాన్యం తరలింపుకు వెంటనే లారీలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలి. మట్టిని నమ్ముకున్న తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోకపోతే భారీ ఎత్తున ఆందోళన చేస్తామని బీర్ పూర్ మండల రైతులు హెచ్చరిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో మీడియా సమావేశం...

అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం :మార్కెట్ చైర్మెన్

గొల్లపెల్లి, మే 8ప్రజాజ్యోతి:
జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది మార్కెట్ చైర్మన్ భీమ సంతోష్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు చేయడం జరుగుతుంది ఇప్పటి వరకు గొల్లపల్లి మార్కెట్ యార్డులో వడ్లు కొనుగోలుకు 3 కాంటాలు నడుస్తున్నాయి 1 కాంటా మక్కలు తూకం వేయడానికి ఉన్నవి ప్రతి రోజు మూడు లారీలు మార్కెట్ యార్డు నుండి రైస్ మిల్లు కి వెళ్ళడం జరుగుతుంది ఒక్క గొల్లపల్లి మార్కెట్ నుండి ఎప్పటి వరకు 26 లారీలు రైస్ మిల్లు కి పంపడం జరిగింది అన్నారు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముస్కు నిశాంత్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ప్రతి గింజని ప్రభుత్వం తప్పకుండా కొనుగోలు చేస్తుందని అన్నారు గౌరవ తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎప్పటికప్పుడు వడ్ల కొనుగోలుకు సంబంధించి అధికారులతో మాట్లాడుతూ రైతులకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది రైతులు ఎవరు కూడా అధైర్య పడవద్దు తడిసిన ప్రతి గింజని ప్రభుత్వం తప్పకుండా కొనుగోలు చేస్తుంది అన్నారు
గత (బిఆర్ఎస్) పార్టీ అధికారమలో ఉన్నపుడు క్వింటలకు 10 కిలోల వరకు వడ్లు దోచుకోవడం జరిగింది అంతే కాకుండా రైతులని రైస్ మిల్లు కాడికి వెళ్లి రైతులే మిల్లర్లతోని మాట్లాడుకొనే పరిస్తితి ఉండే ఇప్పుడూ రైతులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా వడ్లు కొనుగోలు చేస్తాం అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ సారి వడ్లు కొనుగోలు చేయడానికి కొత్తగా అప్ మరియు వడ్ల బస్తాలు తరలించే లారీలకి జి పి ఆర్ ఎస్ పెట్టడం వలన దాని ద్వారా కొనుగోలు కేంద్రాలు 10 రోజులు ఆలస్యం కావడం జరిగింది గత రెండు పంటలకి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన వడ్లను కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయక అట్టి వడ్ల బస్తాలు రైస్ మిల్లులోనే ఉండడం వలన కొంత ఇబ్బంది జరిగింది అట్టి విషయమై మంత్రి గారు అధికారులతో మరియు

రైస్ మిల్లు యజమ్యనంతో మాట్లాడటం జరిగింది రైతు ఎవరుకుడా అధైర్య పడవద్దు అన్నారు
ఒకటి రెండు రోజులు ఆలస్యం అయిన రైతుల యొక్క ప్రతి గింజని రాష్ట్ర ప్రభుత్వం తప్పకుండా కొనుగోలు చేస్తుంది రైతులు ఎవరు కూడా ఆదైర్యపడవద్దు అని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచులు కాసరపు భవాని అరవింద్ గౌడ్ జెల్ల అఖిల అనిల్ కుమార్ బెక్కం గంగారం కొక్కుల జలంధర్ ఆకుల సుమన్ గౌడ్ బుర్ర సుధారాణి భూమయ్య మ్యాక స్వామి మాజీ సర్పంచ్ లు చిర్ర గంగాధర్ శనిగారపు మల్లేశం మాజీ ఎంపీటీసీ లంబ లక్ష్మణ్ మాజీ ఉపసర్పంచ్ కొండా వెంకటేష్ గౌడ్ నాయకులు కచ్చు మల్లయ్య చెవులమద్ది గంగాధర్ గంగరాజం లాగ్పతి రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు

ఘనంగా పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

ముస్తాబాద్, మే 8 (ప్రజా జ్యోతి):
ముస్తాబాద్ మండల కేంద్రంలో పట్టణ అధ్యక్షులు గజ్జెల రాజు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో పెప్పర్ స్ప్రేలకు భయప

దకుండా పోరాడి, ప్రత్యేక తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించి, తల్లి సోనియా గాంధీని ఒప్పించి మెప్పించిన నాయకుడు, ప్రజాసేవలో నిరంతరం కృషి చేస్తూ బీసీ సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న గౌరవ రవాణా శాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి మంత్రి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ బీసీ సమాజ అభ్యున్నతి, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న సేవలు మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. ప్రజలకు ఇంకా ఎన్నో సేవలు అందిస్తూ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ఉండాలని హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఆయన నాయకత్వం రాష్ట్ర సమాజానికి మరింత బలాన్నిస్తూ ప్రజాసేవలో కొత్త దిశానిర్దేశం చేయాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొండం రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండెలి శ్రీనివాస్, తాళ్ల విజయరెడ్డి, కేకే యువసేన అధ్యక్షులు అరుట్ల మహేష్, ఆగుళ్ల రాజేశం, రంజాన్ నరేష్, మిరుదొడ్డి భాను, శీల ప్రశాంత్, బాల్సన్ శ్రీనివాస్, యారటి కర్ణాకర్, గూడూరు చాకలి బాబు, దొనకుల కొండయ్య, గాంతరాజు, గోపాలపల్లి గురుబాబు, గన్నేవాని పల్లె మాజీ సర్పంచ్ మల్లేష్, బండారి సాయి, చెవుల నరేష్, మోర్రాయి పల్లె మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ ఘటనపై బీజేపీ వైఖరిని ప్రజలు గమనించాలి

బొంపెల్లి సురేందర్ రావు

ముస్తాబాద్, మే 8 (ప్రజా జ్యోతి):
ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల క్యాంప్ కార్యాలయాలపై బీజేపీ గుండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కరీంనగర్‌లో

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , మాజీ మంత్రి గంగుల కమలాకర్ పై జరిగిన దాడి ప్రజాస్వామ్యానికి మచ్చ తెచ్చే ఘటన అని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై బండి సంజయ్ చేసిన వ్యక్తిగత అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రెస్‌మీట్ నిర్వహిస్తున్న సమయంలో బీజేపీ కార్యకర్తలు దాడులకు పాల్పడటం హేయమైన చర్య అని అన్నారు. ప్రజాస్వామ్యంలో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ దాడులకు, బెదిరింపులకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమం 14 సంవత్సరాలు కేసీఆర్ నాయకత్వంలో సాగినా ఒక్క చిన్న అశాంతి ఘటన కూడా చోటుచేసుకోలేదని గుర్తు చేశారు. ప్రజల కోసం, తెలంగాణ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడిన బీఆర్ఎస్ పార్టీపై ఇప్పుడు దాడులతో భయపెట్టాలని ప్రయత్నించడం సరికాదన్నారు. దేవుని పేరుతో రాజకీయాలు చేస్తున్న వారు శాంతి, ప్రేమ, ధర్మం గురించి ఆలోచించాలని, ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదని అన్నారు. బీజేపీ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, దాడులతో బీఆర్ఎస్ పార్టీ పోరాటాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఏద్దండి నర్సింహారెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు సర్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బదనకల్ వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు, హమాలీలకు చల్ల ప్యాకెట్ల పంపిణీ

ముస్తాబాద్, మే 8 (ప్రజా జ్యోతి):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బదనకల్ గ్రామంలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు మరియు హమాలీ సంఘ సభ్యులకు చల్ల ప్యాకెట్లను పంపిణీ

చేయడం జరిగింది. మండుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకొని రైతులు, హమాలీలు ఇబ్బందులు పడకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ, వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి వేగవంతంగా వడ్ల కొనుగోళ్లు చేపట్టాలని కోరారు. అలాగే రైస్ మిల్లర్ యజమానులతో కూడా మాట్లాడి, ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో త్వరితగతిన వడ్ల కొనుగోళ్లు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. హమాలీలు, రైతులకు ఇబ్బందులు లేకుండా లారీలను కొనుగోలు కేంద్రాలకు వెంటనే పంపించి వడ్లను దింపుకునేలా సహకరించాలని ఆయన కోరారు. రైతుల కష్టాన్ని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.

నరేంద్ర మోడీ బహిరంగ సభను జయప్రదం చేయండి

నేలకొండపల్లి, మే 8 ప్రజా జ్యోతి: వికసిత భారతావని లక్ష్యంగా దేశాన్ని ప్రగతి పథంలో పయనింప చేస్తున్న ప్రధాని నరేంద్ర మోది బహిరంగ సభ ను జయప్రదం చేయాలని బిజెపి ముస్లిం మైనార్టీ మోర్చా జిల్లా నాయకులు సయ్యద్ మోహినుద్దీన్ కోరారు. నెలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధిని కాంక్షిస్తూ ఈ నెల 10వ తేదీన 8 వేల కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టేందుకు హైదరాబాద్ రానున్న నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్ లో ఈ నెల 10 వ తారీఖున సాయంత్రం 3 గంటలకు జరిగే బహిరంగ సభలో నరేంద్ర మోడీ పాల్గొని ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు. నేపథ్యంలో ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం నుండి పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు వేలాదిగా తరలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ప్రతి గ్రామం నుంచి బిజెపి కార్యకర్తలు సానుభూతిపరులు తరలిరావాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో మైనారిటీ మోర్చా నేలకొండపల్లి మండల నాయకులు షర్ఫుద్దీన్ ఉన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

– మధుబాబు యూత్ సభ్యులు

సత్తుపల్లి మే08(ప్రజా జ్యోతి) మండల పరిధిలోని గంగారం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు,అభివృద్ధి ప్రదాత,గంగారం ఆత్మీయుడు దాసరి మధుమోహన్ రెడ్డి (మధుబాబు)ఆధ్వర్యంలో యూత్ సభ్యులు శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ వేడిని దృష్ట్యా,వారికి కాస్త ఉపశమనం కలుగుతుందని, ఎండాకాలం వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలని, వాళ్లకు సూచనలు సలహాలు అందజేశారు, పని గంటల కోసం ఉదయాన్నే పనికి రావాలని ,త్వరగా పని ముగించుకొని వెళ్లాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండ పట్ల అప్రమత్తంగా ఉండాలని, మంచినీరు ఎప్పుడు అందుబాటులో ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్ కచ్చితంగా ఉండాలని టెంట్ ఉంచుకోవడం చాలా అవసరమని సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిన్న బాబు, ఇరిగేషన్ డి ఈ, మధుబాబు యూత్ సభ్యులు, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

రైతుల ఉసురు పోసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

– టిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇంచార్జ్

వైరా మే 8 ప్రజా జ్యోతి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందని తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ గౌరవరపు జగదీష్ అన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా, అలసత్వాన్ని ప్రభుత్వం అవలంబిస్తుందని చెప్పారు. రైతులు పండించిన ఉత్పత్తులు కల్లాల్లో ఉంటే ప్రభుత్వం కళ్లప్పగించి చూస్తుందని ఎద్దేవ చేశారు. రైతు పండించిన పంటలు ఆరుబయట కల్లాల్లో ఉంచటంతో ఒకవైపు వడగళ్ల వాన అకాల వర్షాలు పడుతున్నాయి. పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి, తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేయటం లేదు, తడిసిన పంటను గిట్టుబాటు ధరలతో కొనుగోలు చేయాలని జగదీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తరుగు పేరుతో రైతులను లూటి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని జగదీష్ పేర్కొన్నారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ఎదురుచూస్తున్నారని తెలిపారు. 2029లో కలవకుంట్ల కవితమ్మ పాలన వస్తుందని పంచజన్య పాలనలో తెలంగాణ రైతులు ప్రజలు సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు.

కల్లూరు ఏసీపీ కార్యాలయాన్ని
ప్రారభించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్

– స్వాగతం పలికిన ఏసిపి వసుంధర యాదవ్ ఐపిఎస్

సత్తుపల్లి మే08(ప్రజా జ్యోతి) ఇటీవల నూతనంగా నిర్మించిన కల్లూరు ఏసీపీ కార్యాలయం ప్రారంభించేందుకు విచ్చేసిన కమిషనర్ సునీల్ దత్ ను సత్తుపల్లి కి చేరుకున్న పోలీస్ కమిషనర్ కు ముందుగా ఏసీపీ వసుంధర యాదవ్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందన స్వీకరించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీస్ సంక్షేమ కార్యక్రమంలో భాగంగా పోలీస్ అధికారులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో,ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల సత్తుపల్లిలో ఆధునిక సదుపాయాలతో, సౌకర్యవంతమైన వాతావరణంలో ఏసీపీ కార్యాలయాన్ని పునర్నిర్మాణం చేపట్టామని తెలిపారు. ఏసీపీ కార్యాలయాల ఆధునీకరణ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించడం, కేసుల దర్యాప్తును వేగవంతం చేయడం, సైబర్ నేరాల కట్టడికి మరింత కృషి, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, మాదకద్రవ్యాల కట్టడికి పటిష్టమైన చర్యలు చెప్పట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్)రామానుజం, ఇన్స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి, సిఐ ముత్తులింగం, కల్లూరు డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

సోసైటీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తా

నేలకొండపల్లి, మే 8 ప్రజా జ్యోతి : సొసైటీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని సోసైటీ అధ్యక్షుడు మైశా శంకర్ పేర్కొన్నారు. నేలకొండపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు గా శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సోసైటీ కార్యదర్శి ఖమ్మం వెంకటేశ్వర్లు, సిబ్బంది తో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. సోసైటీ ఆర్థిక పరిస్థితి, ఆదాయ, వ్యయాలు, రుణాలు, రికవరీ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... సోసైటీ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని పేర్కొన్నారు. తన పై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి. కృతజ్ఞతలు ' తెలిపారు. వారి నమ్మకం ను వమ్ము చేయకుండా మంచి పాలన ను అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సోసైటీ "కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది కనపర్తి నాగేంద్రబాబు, సోసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సిబ్బంది కనపర్తి నాగేంద్రబాబు, సోసైటీ డైరెక్టర్లు మన్నె కృష్ణారావు, కనకబండి కనకరాజు, అనిల్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల రాజకీయ ఘట్టానికి 40 ఏండ్లు

– అభివృద్ధే ఆయన నైజం... ప్రజలే ఆయన బలం ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి మే08(ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆయన రాజకీయ ఘట్టానికి 40 సంవత్సరాలు పూర్తి కావడంతో,స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మాట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం వేడుకలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుమ్మల యుగంధర్ హాజరైనారు. ముందుగా కేక్ కట్ చేసి ఆయనకు రాజకీయ అభినందనలు తెలియజేశారు. అనంతరం తుమ్మల యుగంధర్, మట్టా దయానంద్, ఎమ్మెల్యే రాగమయి మాట్లాడుతూ ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో స్వర్గీయ ఎన్టీ రామారావు టైం లో మంత్రిగా ప్రమాణం చేసి, రాజకీయం ప్రస్థానం ప్రారంభించిన ఆయన మంత్రి పదవిగా ప్రమాణం చేసిన నాటి నుండి అభివృద్ధి ఆయన నినాదంగా,ప్రజలే ఆయన బలంగా పనిచేశారని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఎక్కడ చూసినా ఆయన అభివృద్ధి మాత్రమే కనపడేది అని, ప్రజల కోసం ఏమి చేస్తే బాగుంటది అనే ధోరణిలో మాత్రమే ఆలోచించేవారని అన్నారు. బుగ్గపాడు ఫుడ్ పార్క్,వేంసూర్ పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ వస్తుంది అంటే ఆయన పుణ్యమేనని అన్నారు. ఎక్కడ అభివృద్ధి చూసినా ఆయన శిలాఫలకాలే కనిపిస్తాయని, ఆనాడు జలగం వెంగళరావు ఎలా అభివృద్ధి చేశారు,అదే ధోరణి లో మంత్రి తుమ్మల అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఇంకా ముందు ముందు ప్రజలకు మరింత సేవలు చేసేందుకు భగవంతుడు ఆరోగ్యాన్ని, అష్టైశ్వర్యాన్ని కలుగజేయాలని కోరారు. రాజకీయ కుట్రలో భాగంగా టిఆర్ఎస్ పార్టీ వాళ్ళు చేస్తున్న పుకార్లకు ఘాటుగా ఎమ్మెల్యే రాగమయి స్పందించారు. నియోజకవర్గంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 3500 ఇందిరమ్మ ఇండ్లు నిరుపేదలకు ఇచ్చి, నిర్మాణాలు పూర్తయి, గృహప్రవేశాలు కూడా అవుతుంటే మట్టి దందా, ఇసుక దందా,చేస్తున్నారని భూములను దోచుకుంటున్నారని నిందలు వేస్తున్నారని, మేము ఇద్దరం డాక్టర్స్ వృత్తి చేసుకుంటే ఇప్పటివరకు కోట్లు సంపాదించుకునే వాళ్లమని, ప్రజల అభివృద్ధి కోసం ఇంట్లో ఉన్న డబ్బు సైతం ఖర్చు పెడుతున్నామని, మాకు పెట్టడం మాత్రమే తెలుసు, తీసుకోవటం తెలియదని అది గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నికి మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, ఐదు మండలాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మహిళా యూత్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు,డిసిసి నాయకులు, సత్తుపల్లి నియోజకవర్గ సర్పంచ్ లు, ఉప సర్పంచ్లు,కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,తెలుగుదేశం పార్టీ నాయకులు, అభిమానులు అధికంగా పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణా తరగతులతో
ఉత్తీర్ణత శాతం పెంచాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

పాల్వంచ, మే 8, ప్రజాజ్యోతి: పాల్వంచ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కళాశాలలో సప్లమెంటరీ క్యాంప్‌ను పరిశీలించిన కలెక్టర్ పాల్వంచలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కళాశాలలో ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులను శుక్రవారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు, ఉపాధ్యాయులకు సూచించారు. ప్రత్యేక తరగతి గదులను సందర్శించిన జిల్లా కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి చదువు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు ఎలా సన్నద్ధమవుతున్నారు, రోజువారీగా ఎన్ని గంటలు చదువుతున్నారు, ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు ఎంతవరకు అర్థమవుతున్నాయి వంటి అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఇంటర్‌లో ఫెయిల్ అయ్యామని నిరుత్సాహపడకుండా, ఈ ప్రత్యేక శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు చెప్పే ప్రతి పాఠాన్ని శ్రద్ధగా విని, సందేహాలను వెంటనే నివృత్తి చేసుకోవాలని, ప్రతిరోజూ పునశ్చరణకు సమయం కేటాయించాలని తెలిపారు.క్రమశిక్షణతో చదువుతూ ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరైతే మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. గత ప్రశ్నాపత్రాలను సాధన చేయడం, ముఖ్యమైన ప్రశ్నలను నోట్స్ రూపంలో సిద్ధం చేసుకోవడం ద్వారా మెరుగైన మార్కులు సాధించే అవకాశం ఉంటుందని విద్యార్థులకు వివరించారు. జువాలజీ, బయాలజీ, ఫిజిక్స్, తెలుగు తదితర సబ్జెక్టుల ప్రత్యేక తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయులతో మాట్లాడి ప్రతి విద్యార్థి స్థాయిని అంచనా వేసి బోధన కొనసాగించాలని సూచించారు. బలహీనంగా ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి అదనపు సమయం కేటాయిస్తూ ప్రణాళికాబద్ధంగా శిక్షణ అందించాలని ఆదేశించారు. ప్రతిరోజూ పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రగతిని సమీక్షించాలని తెలిపారు.ప్రత్యేక శిక్షణా తరగతుల ప్రధాన ఉద్దేశ్యం ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడమేనని, అందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, వారిని మానసికంగా ప్రోత్సహించే విధంగా బోధన ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రస్తుతం నిర్వహిస్తున్న సప్లమెంటరీ క్యాంపులో మొత్తం 48 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు జిల్లా కలెక్టర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడిసిన వరి ధాన్యం, మొక్కజొన్నలను మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

– ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి: కామ్రేడ్ ముత్యాల విశ్వనాథం

పాల్వంచ, మే 8, ప్రజాజ్యోతి: సిపిఐ పాల్వంచ మండల కార్యవర్గ సమావేశం శుక్రవారం సిపిఐ కార్యాలయంలో చిల్లా కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ముత్యాల విశ్వనాథం పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న వరి ధాన్యం, మొక్కజొన్న, వేరుశెనగ తదితర పంటలను సీసీఐ ద్వారా ఎటువంటి ఆంక్షలు లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని, రైతులకు పూర్తి మద్దతు ధర చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నందున ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిపిఐ కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని కోరారు. ఇందిరమ్మ గృహాల మంజూరులో విడతల వారీగా కొందరికే ఇళ్లు ఇవ్వడం వల్ల మిగిలిన అర్హులు నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కమిటీల పేరుతో కొందరి వద్ద డబ్బులు వసూలు చేస్తూ అర్హుల జాబితాల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని గ్రామాల్లో నిజమైన అర్హులను గుర్తించి, అర్హులందరికీ ఒకే విడతలో ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పోడు భూముల సమస్యపై మాట్లాడుతూ, సర్వే పూర్తి చేసినప్పటికీ గిరిజన, గిరిజనేతర సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ఫారెస్ట్ అధికారులు ట్రెంచ్‌లు తీస్తామని, మొక్కలు నాటుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. దీంతో పోడు సాగుదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సర్వే చేసిన భూములకు హక్కు పత్రాలు జారీ చేసి, ఫారెస్ట్ అధికారుల వేధింపులను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో సిపిఐ పాల్వంచ మండల కార్యదర్శి కామ్రేడ్ వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఇట్టి వెంకట్రావు, నిమ్మల రాంబాబు, మండల నాయకులు కొంగర అప్పారావు, ఉంద్రాతి రవి, వడ్లకొండ మేరమ్మ, యండూరి ప్రభావతి, వగెల పద్మ, ఇరుకులపాటి సుధాకర్, భూక్య రమేష్, ఎల్లంకి శివరావు, మేక రాంబాబు, కొంక వెంకటరత్నం, లాల్ పాషా, మందపాటి సత్యనారాయణ రాజు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం డీఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం టౌన్ , మే 8 ప్రజాజ్యోతి భద్రాచలం నియోజకవర్గ బీఆర్ఎస్ బాధ్యులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణతో పాటు ఇతర నాయకులు భద్రాచలం డీఎస్పీ అరుణ్‌కుమార్‌ను కలిసారు. ఈ సందర్భంగా డీఎస్పీకు పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా ఉన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు.

నూతన వధువు భవానీని
ఆశీర్వదించిన జర్నలిస్టులు

సత్తుపల్లి మే08 (ప్రజా జ్యోతి) పట్టణంలోని ఓ పత్రిక సీనియర్ జర్నలిస్ట్ బట్రా శ్రీనివాసరావు,రత్న కుమారి ప్రథమ కుమార్తె భవాని, నాగ శరత్ వివాహ వేడుకలు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన బండారు ఉమా మహేశ్వరావు, సంధ్యా రాణి, పూరేటి రాజ్యలక్ష్మి,శ్రీనివాసరావు లు హాజరై నూతన వధువును అక్షింతలు వేసి ఆశీర్వదించారు.

బెంగాల్ రాజకీయాల్లో
బీజేపీ శకం

మొదటిపేజీ తరువాయి..

పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, బీజేపీ జాతీయ నేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బీజేపీ హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సీఎం పదవిని మహిళా నేత బహుశా అగ్నిమిత్ర పాల్‌కు కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.తమిళనాడులో విజయ్ లాగే సువేందు అధికారి కూడా ఈ ఎన్నికల్లో రెండు చోట్ల భవానీపూర్, నందిగ్రామ్ పోటీ చేసి రెండింటిలోనూ ఘనవిజయం సాధించారు. ముఖ్యంగా భవానీపూర్‌లో మమతా బెనర్జీపై 15,000 పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలిచి 'జెయింట్ కిల్లర్'గా నిలిచారు. 294 స్థానాలున్న బెంగాల్ అసెంబ్లీలో బీజేపీ 207 స్థానాలు గెలుచుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. టీఎంసీ 80 స్థానాలకే పరిమితమైంది. ఉదయం జరగనున్న ఈ కార్యక్రమం ద్వారా బెంగాల్ గడ్డపై కమల దళం అధికారికంగా పాలనను ప్రారంభించనుంది. సువేందు 1970 డిసెంబరు 15న తూర్పు మేదినీపుర్‌లోని కర్ములీలో జన్మించారు. ఎంఏ చదివారు. ఆయనది రాజకీయ నేపథ్యమున్న కుటుంబం. తండ్రి సిసిర్ అధికారి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. యూపీఏ హయాంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రిగానూ ఉన్నారు. సువేందు 1995లో తొలిసారి కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలిచారు. 1998లో తండ్రితో కలిసి టీఎంసీలో చేరారు. సువేందు

2006-09 మధ్య రాజకీయాల్లో బాగా ఎదిగారు. 2006లో తొలిసారి కొంటాయీ (దక్షిణ) నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిచారు. అదే ఏడాది కొంటాయీ మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గానూ బాధ్యతలు చేపట్టి.. మూడేళ్లు ఆ పదవిలో కొనసాగారు. సువేందు రాజకీయ జీవితంలో 2007 నాటి నందిగ్రామ్ ఉద్యమానిది ప్రత్యేక పాత్ర. నందిగ్రామ్‌లో 10 వేల ఎకరాలు సమీకరించి సెజ్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రంలోని అప్పటి వామపక్ష ప్రభుత్వం భావించింది. దానికి వ్యతిరేకంగా తృణమూల్ పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టింది. వాటిని సువేందు ముందుండి నడిపించారు. నందిగ్రామ్ ఉద్యమం విజయవంతం కావడంతో.. జంగల్ మహల్ (పశ్చిమ మేదినీపుర్, పురూలియా, బాంకురా జిల్లాలు) ప్రాంతానికి తృణమూల్ ఇంఛార్జిగా సువేందును మమత నియమించారు. మమతకు అత్యంత సన్నిహిత నేతల్లో ఒకరిగా ఎదిగారు. సువేందు 2009లో తమ్లుక్ స్థానం లోక్‌సభ ఎంపీగా గెలిచి జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2016లో నందిగ్రామ్ ఎమ్మెల్యేగా విజయం సాధించి.. మమత సర్కారులో మంత్రి పదవి చేపట్టారు. తృణమూల్ వ్యవస్థాపక సభ్యుడైన ముకుల్ రాయ్ 2017లో పార్టీని వీడారు. అప్పటి నుంచి తృణమూల్‌లో సువేందు ప్రభావం మరింత పెరిగింది. పార్టీలో మమత తర్వాత నంబర్-2 ఈయనేనని అంతా అనుకున్నారు. అయితే క్రమంగా పరిస్థితులు మారిపోయాయి. మమత తన మేనల్లుడు అభిషేక్ బెనర్జీకి పార్టీలో అధిక ప్రాధాన్యమివ్వడం, ఆయనకే పార్టీ పగ్గాలు అప్పగించేలా కనిపించడం సువేందుకు రుచించలేదు. అప్పటికే శారదా కుంభకోణంలో ఆరోపణలు రావడంతో కొంత ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో 2020 చివర్లో అనూహ్యంగా తృణమూల్‌ను వీడి భాజపాలో చేరారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా తరఫున నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగిన సువేందు.. మమతను ఓడించారు. అనంతరం రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో భవానీపుర్‌లో మమతను మరోసారి ఓడించి, ఇప్పుడు ఏకంగా బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు.

పెరిగేది కొండంత.. ఇచ్చేది గోరంత..

- మారని బీడీ కార్మికుల బతుకులు..
- పెంచిన వేతనాల్లో కోతలు..
- వర్ధిబీడీ పేరుతో శ్రమ దోపిడీ..
- వట్టించుకోని ప్రజాప్రతినిధులు

నిజామాబాద్(ప్రజాజ్యోతి): వీడికేడు మంది బీడీ కంపెనీల యాజమాన్యలు దర్జాగా శ్రమదోపిడీ చేస్తున్న వట్టించుకునే నాధుడు లేదు. కార్మిక సంఘాలు నాయకులు

ఉన్నప్పటికి కార్మికుల బతులుకు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. అయితే గురువారం హైదరాబాద్ లో బీడీ కంపెనీ యాజమాన్యలు, కార్మిక సంఘాల ప్రతినిధుల చర్చలు జరిపి కార్మికులకు వేతనాలు పెంచారు. ఈ వేతనాలు రెండు సంవత్సరాల పాటు అమలులో ఉంటాయి.

వేతనాల పెంపు...:

ప్రతి వేయి బీడీలకు రూ.275.23లు చెల్లించేలా బీడీ కంపెనీలకు కార్మిక సంఘాలకు మద్య ఒప్పందం కుదిరింది. ఇది మే 1, 2026 నుంచి ఏప్రిల్ 30, 2028 వరకు అమలులో ఉంటుంది. సెలవు దినాలు, బోనస్ అన్ని కలిపి రూ.6.92 లు పెరిగాయి. పాత వేతనం రూ.268.31 ఉండగా పెరిగినది కలుపుకోని రూ.275.23ల చెల్లించేలా ఒప్పందం కుదిరింది. అలాగే ఇతర కార్మికులకు అంటే ప్యాకర్స్, మునిమ్లు, చాటన్ కార్మికులు, బట్టివాలాలతో పాటు వరిపాలన విభాగం సిబ్బందికి 14,500 మంది ఉన్నారు. వీరిలో ప్యాకర్స రూ.4500 చొప్పున ఇతర కార్మికులకు సిబ్బందికి రూ.2200 చొప్పున నెలసరి వేతనం పెరిగింది.

పేరుకే పెంపు.. ఇచ్చేది శూన్యం..:

బీడీ కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో యాజమాన్యల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలుజరపడం వేతనాలు పెంచడం అనవాయితీగా వస్తుంది. కానీ పెంచిన వేతనాలు చెల్లించడంలో మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీని కోసం వని దినాలు తగ్గించడం, తగ్గించిన వని దినాల స్థానంలో వర్ధిబీడీ తయారు చేయించడం చేస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయిన అటు కార్మిక శాఖ అధికారులు, ఇటు

> బీడీ కార్మికులు అంటేనే పోగచూరిన బతుకులు అనేది అందరికి తెలిసిన సత్యం. ఎన్నికల సమయంలో తప్పా బీడీ కార్మికులు మళ్లీ ఎప్పుడు రాజకీయ నాయకులకు, అధికారులకు గుర్తుకు రారు. లక్షల మంది తమ సమస్యలను పరిష్కారించాలని వినతులు ఇచ్చిన, ర్యాలీలు చేసిన ధర్నాలు చేసిన ఫలితం ఉండటం లేదు.

కార్మిక సంఘాల ప్రతినిధులు వట్టించుకునక్క పాపాన పోవడం లేదు. దీనితోడు రోజువారి బీడీ తయారిలోనూ తగ్గింపు చేయడం వల్ల కార్మికులకు శ్రమకు తగిన వేతనం అందడం లేదు. వాస్తవానికి వేయి బీడీలకు రూ.268,31లు ఇవ్వాలి. అదివారం, ఇతర సెలవు దినాలు పోనూ ప్రతి నెల కనీసం 21 నుంచి 24 వని దినాలు ఇవ్వాలి. కానీ వీటిలో 10 నుంచి 15 వని దినాలు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవని దినాలలో వర్ధిబీడీ వని కల్పిస్తున్నారు. ఈ వనికి ఏలాంటి పీఎఫ్, ఈఎస్ఐ, ఇతర వర్తింపులు ఏవి ఉండవు. వర్ధిబీడీ కంపెనీ కోసం చేస్తున్నప్పటికి ప్రతి వేయి బీడీలకు రూ.150 నుంచి రూ.160లకు మించి ఇవ్వడం లేదు. అంటే సుమారు నెలకు వది రోజుల వని దినాలు రోజుకు వేయి బీడీలకు గాను రూ.100 నుంచి రూ.120 లను కోల్పోవలసి వస్తుంది. ఇలా ఒకోక కార్మికురాలు రూ.1000 నుంచి రూ.1500 వరకు నష్టపోతున్నారు. పైగా అంటే దీని వల్ల బీడీ కార్మికులకు తీరాని నష్టం జరుగుతుంది. యాజమాన్యాలకు కోట్ల రూపాయాల లాభం చేకూరుతుంది. ఇదంతా బహిరంగమే అయినప్పటికి కార్మిక సంఘాల ప్రతినిధులు గానీ కార్మిక శాఖ అధికారులు గానీ పట్టంచుకున్న పాపాన పోవడం లేదు. ప్రతి రెండేళ్లకు ఒక్కసారి పెంచిన అది పేరుకే ఉంటుంది. కాని ఇచ్చేంది మాత్రం నామ మాత్రంగా మారి ఉతుంది.

అన్నింటికి అడ్డా... నిజామాబాద్...:

బీడీ వరిశ్రమకు నిజామాబాద్ అడ్డాగా కొనసాగుతుంది. నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి, మెదక్, సిద్దిపేట్, సిరిసిల్లా, కరీంనగర్, జగిత్యాల, పెద్దవల్లి, అదిలాబాద్, నిర్మల్ జిల్లాలతో పాటు చుట్టు వక్కల మరికోన్ని జిల్లాలో బీడీ చరిశ్రమ కొనసాగుతుంది. వీటన్నింటికి కేంద్రంగా నిజామాబాద్ లో కంపెనీలు వని చేస్తున్నాయి. ఇక్కడ తయారు చేస్తున్న బీడీని మహారాష్ట్రతో పాటు నార్త్ ఇండియాలోని గుజరాత్, మధ్యప్రదేశ్, యూపి, బీహార్ రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్కడ బీడీకి మంచి వ్యాపారం ఉండటంతో మన బీడీ అంతటి ప్రాచుర్యం ఉంది. నిజామాబాద్ కేంద్రంగా ఉన్న బీడీలు అన్ని తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యంగా ఉ త్తర తెలంగాణ జిల్లాలో 7 లక్షలకు పైగా ఉన్నారు. వీరి లెక్కల ప్రకారం బీడీ కంపెనీ యాజమాన్యలు ఏ స్థాయిలో దోపిడి చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

నోరెత్తని ప్రజాప్రతినిధులు..:

ఎన్నికల సమయంలో మీనహా ఇతర సమయంలో ప్రజాప్రతినిధులు బీడీ కార్మికుల గురించి నోరె ఎత్తడం లేదు. లక్షల సంఖ్యలో ఉన్న కార్మికుల పట్ల పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరింస్తున్నారు. దీనికి తోడు గెలిచిన ఏ పార్టీ అయిన బీడీ కంపెనీల యాజమన్యాలు నెలనెల మాముళ్లతో ఇటువైపు కన్నెత్తి చూడకుండా చేస్తున్నారు. అందుకే ఎన్నికల సమయంలో తప్పా ఇతర సమయంలో బీడీకార్మికులను వలకరించే దిక్కు ఉండటం లేదు.

ఆదిలాబాద్ లో ఘనంగా రెడ్ క్రాస్, తలసేమియా దినోత్స వం
90 వ సారి రక్త దానం చేసిన సభ్యులు బాల శంకర్ కృష్ణ

ఆదిలాబాద్ బ్యూరో, మే 8, (ప్రజా జ్యోతి): ప్రపంచ రెడ్ క్రాస్ డే & తలసే మియా దినోత్సవంను శుక్ర వారం ఆదిలాబాద్ లో ఘనం గా జరుపుకున్నారు. దీనిని పురస్కరించు కొని 90వ సారి రక్తదానం చేసిన రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ బాల

శంకర్ కృష్ణ ను పలువురు అభినందించారు. మే 08 రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హ్యాంద్రు డూనాట్ జన్మదిన సందర్భం గా ఆదిలాబాద్ జిల్లా కేంద్రాని కి చెందిన బాల శంకర్ కృష్ణ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చై ర్మన్ 90వ సారి రక్తదానం చేసి తన ఉదారతాను చాటుకున్నారు. శుక్రవారం బోథ్ కు చెందిన కొండ్లపు సుశీల (65) శస్త్ర చికిత్స నిమిత్తం 90 వ సారి రక్తధానం చేసి వారి ఉదా రతాను చాటుకున్నారు. బాల శంకర్ కృష్ణ గత 29 సంవత్స రాలనుండి రెడ్ క్రాస్ సొసైటీ, యువజన సంఘాలలో ఎన్నో సామజిక కార్యక్రమలకు పెద్ద పీఠ వేసి రాజ్ భవన్ లో సైతం రాష్ట్ర గవర్నర్ చేతుల మీదిగా రాష్ట్ర ఉత్తమ రక్త దాత పుర స్కారం అందుకున్నారు. గత సంవత్సరం ప్రపంచ రక్త దాత ల దినోత్సవం సందర్భంగా దేశంలోనే అరుదైన పుర స్కా రాలు అందుకొని జిల్లా కు వన్నె తెచ్చిన ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆధ్వ ర్యంలో 89వ సారి రక్తధానం చేసి జిల్లా కలెక్టర్ రాజర్షి షా చేతులమిదిగా ప్రశాంషా ప త్రం అందుకొని అందరి మన్న నలు పొందారు. నేటితో 90వ సరి రక్తధానం చేసిన బాల శం కర్ కృష్ణ ను రక్త దాత సుఖీభ వ అని పలువురు అభినదిం చారు.

కేరళం సిఎం రేసులో కేసీ వేణుగోపాల్

మొదటిపేజీ తరువాయి..

పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు సమర్పించినట్టు పార్టీ వర్గాలు శుక్రవారంనాడు తెలిపాయి. పార్టీకి ఎన్నికైన ఎమ్మెల్యేలు, కూటమి భాగస్వాములు, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని పార్టీ తుది నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. సీఎం అభ్యర్థుల రేసులో కేసీ వేణుగోపాల్‌తో పాటు గత అసెంబ్లీలో విపక్ష నేత వీడి సతీశన్, వెటన్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాల పోటీ పడ్డారు. అయితే పార్టీ అధిష్టానానికి అత్యంత విశ్వసనీయుడిగా పేరున్న 63 ఏళ్ల కేసీ వేణుగోపాల్ ముందు వరుసలో ఉన్నట్టు చెబుతున్నారు. ఆయనను తదుపరి సీఎంగా అధిష్టానం ప్రకటిస్తే ఎంపీ స్థానానికి ఆయన రాజీనామా చేయాల్సి ఉంటుంది. కాగా, కాంగ్రెస్ కార్యకర్తలు బహిరంగంగానే వేణుగోపాల్ అభ్యర్థిత్వానికి మద్దతు ప్రకటించారు. యూడీఎఫ్ విజయానికి నిజమైన వ్యూహకర్త ఆయనేనని, ఆయనను నాయకన్, హీరో అని చిత్రీకరిస్తూ పార్టీ కార్యాలయం వెలుపల పోస్టర్లు కూడా వెలిసాయి.

దేశం గర్వించేలా కొడంగల్
అభివృద్ధి

మొదటిపేజీ తరువాయి..

ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు

సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ-వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు. కొడంగల్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి మా బాధ్యత

మొదటిపేజీ తరువాయి..

ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. మైనారిటీల వాటాను వారికి అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయబోదని హామీ ఇచ్చారు. గత ఏడాది హజ్ యాత్రకు వెళ్లిన సమయంలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది మృతి చెందిన ఘటనను సీఎం గుర్తు చేసుకున్నారు. ఆ విపత్కర సమయంలో ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించి, మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించి ఆదుకుందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వైట్ కాలర్ ఉద్యోగాల కంటే బ్లూ కాలర్ జాబ్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. అమెరికా కంటే జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం పేర్కొన్నారు. ఈ అవకాశాలను మన యువత అందుకోవాలనే ఉద్దేశంతోనే ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసి నైపుణ్య శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో వేలాది మంది మైనారిటీ సోదరులు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారని, వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఒక ప్రతిష్టాత్మక నిర్ణయం తీసుకుందని సీఎం చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న పాత ఆటోలన్నింటికీ ఉచితంగా రెట్రో ఫిట్టింగ్ చేసి, వాటిని ఎలక్ట్రిక్ ఆటోలుగా మారుస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల ఇంధన ఖర్చులు తగ్గి, ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ' మాకు హిందూ, ముస్లిం అనే భేదాలు లేవు. అందరూ భాయీ-భాయీగా ఉండాలన్నదే మా ఆకాంక్ష. అయితే, 'సర్ ' పేరుతో కొందరు తెలంగాణలో ఓట్లు తొలగించేందుకు కుట్రలు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లు మన దగ్గర జరగనివ్వకూడదు. ఈ కుట్రలను ప్రజలందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలి. సంక్షేమం, అభివృద్ధిలో మైనారిటీల వాటాను పక్కాగా అమలు చేస్తూ.. తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతా' అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని మైనారిటీల సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలని అధికారులను ఆదేశించారు. గంగా-జమునా తెహజీబ్

ప్రతిబింబించేలా రాష్ట్ర సంస్కృతిని చాటిచెప్పాలని సీఎం స్పష్టం చేశారు. మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మైనారిటీ పాఠశాలల్లో సైతం ంఎ ఆధారిత బోధనను ప్రవేశపెట్టాలని, తద్వారా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. గ్రూప్స్ పరీక్షల్లో విజయం సాధించిన మైనారిటీ అభ్యర్థులకు మైనారిటీ సంక్షేమ శాఖలోనే కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం సూచించారు. అలాగే, చదువులో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మంత్రి అజారుద్దీన్, షబ్బీర్ అలీ,ఎంపిలు అసలదుద్దీన్ ఓవైసీ, అనిల్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967